01ATP09_01ATP09.qxd 09-08-2025 PM 10:36 Page 1








అనంతపురం/శ్రీ సత్యసాయి

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

ఆదివారం 10 ఆగస్టు 2025 పేజీలు : 04


# దేశంలో దొంగ ఓట్ల రాజ్యం నడుస్తోంది..!!

- వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారు
- రాహుల్‌గాంధీ దొంగ ఓట్లపై ప్రశ్నిస్తే కొట్టి పారేయడం సిగ్గుచేటు
- డబుల్ ఇంజన్ సర్కార్ అప్పులు చేయడంలో స్పీడ్ పెంచింది
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



బహిరంగసభలో మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

**గుంతకల్లు, ఆగస్టు 9 ప్రభాతవార్త**

దేశంలో దొంగ ఓట్ల రాజ్యం నడుస్తోందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. శనివారం సిపిఐ 14వ పట్టణ మహాసభలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పట్టణ కార్యదర్శి గోపీనాథ్ అధ్యక్షతన పాత బస్టాండ్‌లో జరిగిన బహిరంగ సభను ఉద్దేశించి రామకృష్ణ మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను గుప్పెట్లో పెట్టుకుని ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తోందని విమర్శించారు. ఎన్నికల కమీషన్‌తో కుమ్మక్కై లక్షల దొంగ ఓట్లు రాసుకుంటున్నారని ఆరోపించారు. బెంగళూరులోని సెంట్రల్ నియోజకవర్గంలో దాదాపు లక్ష దొంగ ఓట్లు రాసుకోవడమే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ దొంగ ఓట్లపై నిలదీస్తే ఎన్నికల కమీషన్ అధికారి కొట్టి పారేయడం సిగ్గుచేటన్నారు. దొంగ ఓట్ల ద్వారానే మోడీ మూడోసారి అధికారం చేపట్టారన్నారు. దొడ్డిదారిన అధికారంలోకి రావాలని బీహార్‌లో కూడా 65 లక్షల ఓట్లు తొలగించారన్నారు. మోడీ 11 ఏళ్ల పాలనలో దేశ ప్రజలకు ఏమాత్రం మంచి జరగలేదన్నారు. పేదరిక నిర్మూలన, బ్లాక్ మనీ వెళికితీస్తానన్న మోడీ మాట తప్పారని ధ్వజమెత్తారు. కార్పొరేట్ సంస్థలతో పాటు ఆదాని, అంబానీలకు మాత్రం లక్షలాది కోట్లు దోచి పెట్టారన్నారు. దేశంలోని అన్ని పార్టీలను ఏకతాటిపైకి తెచ్చి మోడీ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టబోతున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలోని డబుల్ ఇంజన్ సర్కార్ అప్పులు చేయడంలో స్పీడ్ పెంచిందని చురకలు అంటించారు. కేవలం ఏడాది కాలంలోనే ఒక లక్ష 75 వేల కోట్లు అప్పు చేశారని గుర్తు చేశారు. కేవలం అమరావతికే 31 వేల కోట్లు వెచ్చించారన్నారు. ప్రతి మంగళవారం 4 నుండి 5 వేల కోట్లు అప్పు చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో లంచాలు లేకుండా ఏ ఒక్క పని జరగడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో అవినీతి పెట్రేగిపోతోందన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లు నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందన్నారు. 2016లో పూర్తి కావాల్సిన ఫోర్ లైన్ రోడ్డు ఇప్పటిదాకా పూర్తి కాలేదన్నారు. రాగులపాడు లిఫ్ట్ ఇరిగేషన్ నుండి పిల్లకాలువ ద్వారా నీరు అందించడానికి అవసరమైన 42 కోట్లు కూడా నాయకులు సాధించుకోలేకపోతున్నారన్నారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసినా రోడ్లు గుంతలమయంగా కనిపిస్తున్నాయన్నారు. గుత్తి మండలంలో జీవానందరెడ్డి గార్మెంట్ దుకాణాలు ఏర్పాటు చేసి 500 మందికి ఉపాధి కల్పిస్తుంటే ఇక్కడి నాయకులు మాత్రం ఒక్కరికి కూడా ఉపాధి చూపించలేకపోతున్నారన్నారు. అంతకుముందు అజంతా సర్కిల్ నుండి సిపిఐ కార్యాలయం వరకు ఎర్రజెండాలు చేతబూని వేలాదిమందితో భారీ ర్యాలీ నిర్వహించారు. దీంతో పట్టణ ప్రధాన రోడ్లు ఎరుపురంగుతో కిక్కిరిసిపోయాయి. ఈ కార్యక్రమంలో నాయకులు రాజేష్‌గౌడ్, విల్సన్‌బాబు, గోవిందు, నియోజకవర్గం కార్యదర్శి వీరభద్రస్వామి, సహాయ కార్యదర్శి మహేష్, పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండి గౌస్, మండల కార్యదర్శి రాముడాయల్, నాయకులు మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

- వజ్రకరూరు, ఆత్మకూరులో భారీ వర్షం - అన్నదాతల్లో ఆనందం

**అనంతపురం, ఆగస్టు 9, ప్రభాతవార్త బ్యూరో**

గత కొద్దిరోజులుగా అనంతపురం జిల్లా లోని వివిధ మండలాల్లో విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. కొన్ని మండలాల్లో ఎక్కువ. కొన్ని మండలాల్లో తక్కువ వర్షాలు పడుతున్నప్పటికీ ఎక్కువ మండలాల్లో వర్షాలు కురుస్తుండడంతో అన్న దాతల్లో ఆనందం వ్యక్తం అవుతుంది. శుక్రవారం రాత్రి వివిధ మండలాల్లో కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి..

వజ్రకరూరులో 86, ఆత్మకూరులో 74, సెట్టూరులో 68 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అదేవిధంగా వెలుగుప్పల లో 65, విడపనకలు , తాడపత్రి లో 61, గుమ్మగట్ట, బ్రహ్మసముద్రంలో 58, పెద్దవడుగూరులో 52, ఎల్లనూరులో 49, యాడికిలో 48, గార్లదిన్నెలో 46, కంబదూరు, ఉరవకొండలో 45 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. రాయదుర్గంలో 43, కుందుర్పి, కళ్యాణ్ దుర్గం లో 39, అనంతపురం అర్బన్ లో 32, గుంతకల్లులో 30, సింగనమల లో 28, అనంతపురం రూరల్ లో 28, పామిడిలో 25, కనేకల్, రాప్తాడు లో 21 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.. జిల్లాలో అత్యంత తక్కువగా పెద్దపప్పూరు, బొమ్మనహాల్ మండలాల్లో వర్షం పడింది. అనంతపురం జిల్లాలోని 32 మండలాల్లో సగటున శుక్రవారం రోజు 39.2 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 1253. 6 మిల్లీమీటర్ల వర్షం కురవడం విశేషం.. అనంతపురం జిల్లాలోని వివిధ మండలాల్లో ఆగస్ట్ నెలలో గత వారం రోజులుగా వాతావరణ శాఖ కేంద్రం నమోదు చేసిన వర్షపాత వివరాలు పరిశీలిస్తే వజ్రకరూరు, ఆత్మకూరు, సెట్టూరు, బెలుగుప్ప, విడపనకల్లు,గుమ్మగట్ట, బ్రహ్మసముద్రం, పెద్దవడుగూరు, ఎల్లనూరు, ఉరవ కొండ, రాయదుర్గం, డి . హీరేహాల్, నార్పల తదితర మండలాల్లో భారీ వర్షాలు పడ్డాయని చెప్పొచ్చు. అనంతపురం జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ లో సగటున 61 మిల్లీమీటర్లు పడాల్సి ఉండగా 47 మిల్లీమీటర్ల వర్షమే పడింది. జులై నెలలో సగటున 64 మిల్లీమీటర్ల వర్షం పడాల్సి ఉండగా 34 మిల్లీమీటర్ల వర్షమే పడింది.. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనప్పటి నుంచి సరైన వర్షాలు పడకపోవడంతో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. పంటలు సాగు చేసుకోలేక రైతులు తమ భూములను బీడులుగా పెట్టుకున్నారు. అంతో ఇంతో సాగుచేసిన పంటలు సరిగా లేక పలువురు రైతులు తమ పంటను తీసివేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. ఇలాంటి వర్షాభావ పరిస్థితుల్లో ఆగస్టు నెలలో గత వారం రోజుల నుంచి వర్షాలు విస్తారంగా పడుతుండడంతో రైతులు ఊపిరి పీల్చుకుంటున్నారు.. పంటలు సాగు చేసిన రైతులు మాత్రం ఈ వర్షాలతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తుండగా పంటలు సరిగా లేని రైతులు, విత్తనమే వేయని రైతులు నిరాశ, నిస్పృహతో ఉన్నారు..



# 10 పంపులతో నీటి ఎత్తిపోతలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సంతోషం..!

- రాగులపాడు పంప్ హౌస్ నుండి 10 పంపులతో కొనసాగుతున్న నీటి ఎత్తిపోతలు
- నీటి ఎత్తిపోతల వీడియోలను ముఖ్యమంత్రికు పంపిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్
- ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపిన ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



రాగులపాడు లిఫ్ట్ నుండి 10 పంపులతో కృష్ణా జలాలను ఎత్తిపోస్తున్న దృశ్యం

**ఉరవకొండ, ఆగస్టు 9 ప్రభాతవార్త**

ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం రాగులపాడు లిఫ్ట్ (పంప్ హౌస్) నుంచి 10 మోటార్లతో కృష్ణా జలాల ఎత్తిపోతలు జరుగుతుండడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంతోషం వ్యక్తం చేశారు. తాజాగా శనివారం నుండి 10 మోటార్లతో నీటి ఎత్తిపోతలకు సంబంధించిన వీడియోలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ముఖ్యమంత్రికు పంపారు. దీంతో ముఖ్యమంత్రి ఆ వీడియోలను చూసి ఈ మేరకు స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ హంద్రీనీవా కాలువను వెడల్పు చేసి రాగులపాడు పంప్ హౌస్ నుంచి 10 మోటార్లతో నీటి పంపింగ్ చేసేలా చర్యలు తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది లోపల 6 మోటర్ల నుంచి 12 మోటర్లను వాడుకునేలా కాలువని రెండింతల సామర్థ్యానికి తీసుకువెళ్లడం జరిగిందని, ప్రస్తుతం కాలవలో రెండింతల సామర్థంతో నీరు ప్రవహిస్తోందని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

# ఆర్థిక శాఖా మంత్రిని అభినందించి, కృతజ్ఞతలు తెలిపిన బిజెపి జిల్లా అధ్యక్షులు

- 100 రోజుల్లో రికార్డు స్థాయి హంద్రీనీవా కాలువ వెడల్పు పూర్తి చేయడం హర్షించదగ్గ విషయం
- గత ప్రభుత్వం కంటే ఎన్‌డిఏ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలు అమలు భేష్ - బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్

**కూడేరు, ఆగస్టు 9 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా బిజెపి అధ్యక్షులు రాజేష్ శనివారం ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ను ఆయన స్వగృహములో కలిసి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి పయ్యావుల కేశవ్ ఉరవకొండ నియోజకవర్గంలో ప్రత్యక్షంగా ఎన్నో ప్రజల కోసం అభివృద్ధి సంక్షేమ పథకాలను నెరవేర్చడం కోసం అహర్నిశలు శ్రమిస్తూ కష్టపడుతున్నాడని అన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాలు మంత్రి పయ్యావుల కేశవ్ కే దక్కుతుందని ఆయన హర్షం వ్యక్తం చేశారు. రికార్డు స్థాయిలో హంద్రీనీవా కాలువను వెడల్పు చేసేదిశగా అడుగులు వేసి కేవలం వంద రోజుల్లోనే వాటిని పూర్తిచేసి నీటిని విడుదల చేయడం అమోఘమన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఆర్థిక శాఖామంత్రినే ఐనా ఉరవకొండ నియోజకవర్గానికి మాత్రం మొదటి కూలిగానే ఉంటానని చెప్పడం ఆయన ప్రత్యేకత అని అన్నారు. ప్రజలు తన దృష్టికి తీసుకు వచ్చిన పనులను వెంటనే స్పందించి అమలు చేయడం మంత్రి కేశవ్ కే సాధ్యమవుతుందని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో గ్రామీణ ప్రాంతాలకు రహదారులైతేనేమి, గ్రామాలలో సిసి రోడ్లు అయితేనేమి, అలాగే రైతులకు గోకులం షెడ్లు, ప్రతి నెల1వ తేదీ పెన్షన్లు మంజూరు చేయడం,ఇలా చెప్పుకుంటూ పోతే ఆర్థిక శాఖ మంత్రికే సాధ్యమని అందులో ఆయనకు ఆయనే సాటి అని అన్నారు. గత ప్రభుత్వంలో ఐదు సంవత్సరాల పరిపాలించినా అభివృద్ధి శూన్యమని ఎన్డీఏ కూటిమి ప్రభుత్వం 13 నెలలోనే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వానికి సాధ్యమైందని కొనకొండ్లరాజేష్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. అలాగే మంత్రి కేశవ దృష్టికి పలు సమస్యలను తీసుకుని వెళ్లడం జరిగింది. హంద్రీనీవా కాలువ ద్వారా, కూడేరు మండలంలోని కూడేరు ఒలేకుంట, ముద్దలాపురం, ఇప్పేరు, అరవకూరు, పొడి చెరువు, చెరువులకు నీరును వదిలేలా అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఈ సందర్భంగా మంత్రిని కోరినట్లు అయిన తెలియజేశారు. మంత్రి పయ్యావుల కేశవ్ వాటిపై స్పందించి, వెంటనే అవకాశం ఉన్న ప్రతి చెరువుకు నీటిని వదిలేలా ప్రయత్నం చేస్తానని ఉరవకొండ నియోజకవర్గ వ్యాప్తంగా ఏవైనా సమస్యలు మీ దృష్టికి వస్తే నాకు తెలియజేయాలని ఈ సందర్భంగా బిజెపి జిల్లా అధ్యక్షునికి సూచించినట్లు తెలిపారని ఆయన అన్నారు.



మంత్రి పయ్యావుల కేశవ్‌తో బిజెపి జిల్లా అధ్యక్షులు కొనకొండ్ల రాజేష్

# 14 నెలల్లో రూ.1.75 కోట్ల సీఎంఆర్ఎఫ్ నిధులు

- సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ - అర్బన్ కార్యాలయంలో 6 మందికి 6.47 లక్షలు చెక్కులు అందజేత



సీఎం ఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే దగ్గుపాటి

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 09 ప్రభాతవార్త**

14 నెలల కాలంలోనే ఒక్క అనంతపురం అర్బన్ నియోజకవర్గానికే రూ.1.75 కోట్లు సీఎంఆర్ఎఫ్ నిధులు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజూరు చేశారని.. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు.

శనివారం అర్బన్ టిడిపి కార్యాలయంలో ఆయన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. మొత్తం ఆరు మందికి రూ.6.50 లక్షలు చెక్కులు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి ఎమ్మెల్యే దగ్గుపాటికి లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటి మాట్లాడుతూ అనంతపురం నగరంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారని.. అడిగిన వెంటనే సాయం చేస్తున్నారని అన్నారు. గత ఐదేళ్ల కాలంలో ఎక్కడ చూసినా గుంతలు రోడ్లు కనిపించేవని.. కానీ ప్రస్తుతం లోటు బడ్జెట్ లో ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు మరమ్మతులు చేశారన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం ద్వారా లక్షకు పైగా ఇళ్ల వద్దకు మేము వెళ్లామని.. ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను వివరించామన్నారు. ప్రజల నుంచి కూడా మంచి స్పందన వచ్చిందన్నారు. తొలి సంతకం ద్వారానే ఐదు కీలక హామీలు నెరవేర్చడంతో పాటు 47 వేల కోట్ల రూపాయలు బీసీలకు కేటాయించారన్నారు.

పదివేల కోట్ల రూపాయలు తల్లికి వందనం ద్వారా అందించారన్నారు. రైతు సంక్షేమం కోసం అన్నదాత సుఖీభవ కింద ఒక్కో రైతుకు 7వేల రూపాయలు అందించినట్లు వివరించారు. ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఉంటుందని స్పష్టం చేశారు. మరో నాలుగేళ్లలో రాష్ట్రంలో మరింత అభివృద్ధి సంక్షేమాన్ని చూస్తారన్నారు. అత్యంత వెనుకబడిన అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాల్వను 1800క్యూసెక్కుల నుంచి 3600 క్యూసెక్కులకు సామర్థ్యాన్ని పెంచారన్నారు. 100 రోజుల్లోనే ఈ పనులు పూర్తి చేసి రికార్డు సృష్టించారన్నారు. అర్బన్ నియోజకవర్గంలో సమస్యకు కూడా ముగింపు పలబోతున్నామని.. అక్టోబర్ రెండు నాటికి అక్కడ చెత్త లేకుండా చేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుగ్గయ్య చౌదరి, అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# పరిటాల వారి ఇంట రక్షాబంధన్ సందడి

- తన సోదరులకు రాఖీ కట్టిన ఎమ్మెల్యే పరిటాల సునీత
- మాస్టర్ పరిటాల రవీంద్రకు రాఖీ కట్టిన సోదరీమణులు
- తన జీవితంలో సోదరుల సహకారాన్ని మరువలేనన్న సునీత



తన సోదరులకు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**రాప్తాడు, ఆగస్టు 9 ప్రభాతవార్త**

రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఇంట రక్షా బంధన్ సందడి కనిపించింది. అనంతపురంలోని తన నివాసంలో కుటుంబసభ్యులతో కలిసి రాఖీ పౌర్ణమి ఘనంగా జరుపుకున్నారు. సోదరులు ధర్మవరపు బాలాజీ, మురళీ, కిరణ్, రాజా తదితరులకు ఎమ్మెల్యే సునీత రాఖీలు కట్టారు. మిఠాయిలు తనిపించి తన ప్రేమను చాటుకున్నారు. సోదరులు ఎమ్మెల్యే సునీత పాదాలకు నమస్కారం చేసి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే కార్యాలయ సిబ్బంది, గన్ మెన్లకు రాఖీ కట్టారు. మాస్టర్ పరిటాల రవీంద్రకు సోదరీమణులు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత రాప్తాడు నియోజకవర్గ ప్రజలకు, పరిటాల అభిమానులకు రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. వీరంతా ఒక ఎమ్మెల్యేగానే కాకుండా సోదరిగా భావించి ప్రతి క్షణం నా వెంట నడుస్తుంటారన్నారు. రాజకీయాల్లోకి ఇంత ధైర్యంగా నిలబడ్డానంటే ప్రజాభిమానంతో పాటు ఇలాంటి సోదరుల సహకారమేనన్నారు. ప్రతి ఇంట్లో మహిళకు రక్షణగా ఒక సోదరుడు ఉండటం అదృష్టమన్నారు. రాష్ట్రంలో ప్రతి ఆడబిడ్డ సంరక్షణ, సంక్షేమం కోసం కూటమి ఆధ్వర్యంలోని ఈ ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే సునీత అన్నారు.



# పెరుగుతున్న చిరుత పులుల సంఖ్య..!

- అడవులు అంతరిస్తుండటంతో జనారణ్యంలోకి వస్తున్న వైనం
- ఆహారం కోసం గ్రామాల వైపుకు వస్తుండటంతో భయాందోళనలు
- గడిచిన పదేళ్లలో చిరుత పులుల సంఖ్య భారీగా పెరిగినట్లు అంచనా
- చిరుతల గణన నిర్వహించి సంరక్షించాలని కోరుతున్న ప్రజలు

**ఉరవకొండ, ఆగస్టు 9 ప్రభాతవార్త**

చిరుత పులుల సంఖ్య జిల్లాలో క్రమేనా పెరుగుతోంది. దాదాపు 10 సంవత్సరాల క్రితం వరకు అక్కడక్కడ వేళ్ళమీద లెక్కపెట్ట గలిగినంత మేర ఉన్న వాటి సంఖ్యలో ఇప్పుడు పదుల సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోంది. ఇదివరకు చిరుతలు ఎక్కువగా కొండ గుట్టలు, అటవీ ప్రాంతా ల్లోనే సురక్షితంగా జీవనం సాగిస్తూ వస్తుండగా క్రమేనా అడవులను, కొట్టగుట్టలను సైతం చదును చేసుకొని సాగు చేసుకోవడం, ఇతరత్రా అవసరాలకు వినియోగించుకొంటుండటంతో అవి జనారణ్యంలోకి వచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఒక చిరుత పులి ప్రతి రోజూ దాదాపు 50 కిలోమీటర్ల వరకు ప్రయాణించగలదని తెలుస్తోంది. ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గంలోని ఉరవకొండ, వజ్రకరూరు, బెలుగుప్ప, కూడేరు మండలాలు, కళ్యాణదుర్గం, రాయదుర్గం నియోజకవర్గాల్లో చిరుతల సంచారం అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. అవి అధికంగా జింకలు, అడవి జంతువులను వేటాడి ఆకలి తీర్చుకోవడం జరుగుతూ వస్తోంది. అటవీ ప్రాంతాల్లో ఆహారం లభించని సమయాల్లో అవి గ్రామాలవైపుకు వచ్చి కుక్కలు, గాడిదలు, గొర్రెలు, మేకలపై దాడిచేసి చంపి తింటున్నాయి. ప్రతిరోజూ నియోజకవర్గంలోని ఏదో ఒక గ్రామంలో చిరుతలు తారస పడుతుండటంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. వర్షాలు కురుస్తుండటంతో రైతులు వ్యవసాయ పనులు బిజీగా ఉంటుండగా చిరుతలు ఎప్పుడు ఎక్కడి నుంచి వచ్చి దాడులు చేస్తాయోనని గొండ గట్టుల సమీపంలో భూములు కల్గిన రైతులు వాపోతున్నారు. చిరుతలు కుక్కలు, గొర్రెలు, మేకలను ఎత్తుకెళితే పర్వాలేదుగాని మనిషి రక్తాన్ని రుచి చూస్తే నేరుగా గ్రామాలపైనే దాడులు చేసే అవకాశాలు లేకపోలేదని దాదాపు 13 సంవత్సరాల క్రితం వజ్రకరూరు మండలం గూళపాళ్యం గ్రామంవద్ద చిరుత పులి వరుస దాడుల్లో అనేకమంది తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలవ్వగా చివరికి చిరుత కోసం ప్రత్యేక గాలింపులు జరిపి దాన్ని పోలీసులే మట్టుబెట్టాల్సి వచ్చిందని అంటున్నారు. మళ్లీ అలాంటి పరిస్థితులు తలెత్తకుండా చిరుతలు గ్రామాల వైపునకు రాకుండా అటవీశాఖ అధికారులు తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. జిల్లాలో ఎన్ని చిరుత పులులు ఉన్నాయి.. అవి ఏ ప్రాంతంలో ఎక్కు వగా ఉన్నాయో తెలుసుకోవడానికి చిరుతల గణన చేపట్టి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# అన్న చెల్లెళ్ల బంధం ఎన్నటికీ విడిపోదు



ఎమ్మెల్యే రాజుకు రాఖీ కడుతున్న ఎమ్మెల్యే సింధూర రెడ్డి.

**మడకశిర టౌన్ ఆగస్టు 9 ప్రభాతవార్త.**

మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు ఎం.ఎస్. రాజు పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూరా రెడ్డి రాఖీ కట్టి తమ సోదర భావాన్ని చాటారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని అనంతపురం లోని ఎం.ఎస్. రాజు నివాసానికి సింధూరా రెడ్డి రాఖీతో వెళ్లారు. తమ నివాసానికి వచ్చిన సింధూరారెడ్డిని ఎం.ఎస్.రాజు సతీమణి ఉమాదేవి ఆప్యాయంగా ఆహ్వానించారు. సింధూరారెడ్డి రాకతో ఎం.ఎస్.రాజు ఇంట్లో సందడి వాతావరణం నెలకొంది. ఎం.ఎస్.రాజుకు రాఖీ కట్టిన సింధూరా రెడ్డికి ఎం.ఎస్.రాజు దంపతులు చీర, సారె పెట్టి గౌరవించారు. అనంతరం కాసేపు సరదాగా ముచ్చటించారు.

# వర్షం పడితే ఆ వంతెన దాటాడం కష్టమే!







వరద నీటిలో ప్రయాణించలేక ఇబ్బంది పడుతున్న ద్విచక్ర వాహనదారులు, వరదనీటిలో నానా అవస్థలు పడుతూ ఎడ్లబండిలో పంట పొలాలకు వెళ్తున్న రైతులు , రైల్వే రోడ్డు మెట్లను దాటుకుంటూ వస్తున్న ప్రజల దృశ్యం

**కంబదూరు, ఆగస్టు 09 ,ప్రభాతవార్త**

కంబదూరు మండల కేంద్రంలో శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి మల్లేశ్వర స్వామి ఆలయ సమీపంలో ఉన్న రైల్వే వంతెన కిందకు భారీ గా వర్షపు నీరు చేరింది. దీంతో రైతులు , వాహనదారులు ,ప్రజలు వరద నీటిలో ప్రయాణించేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరద నీటిలో ప్రయాణించిన ద్విచక్ర వాహనాలు మొరయించడంతో ద్విచక్ర వాహనదారులు చాలాసేపు ఇబ్బంది పడ్డారు. పలువురు ప్రజలు మాట్లాడుతూ వర్షం పడినప్పుడు రైల్వే వంతెనను దాటడానికి నానా పాట్లు పడుతున్నామాన్నారు. వరద నీటిలో నడవలేక రైల్వే వంతెన పై ఉన్న మెట్ల ద్వారా రోడ్డును దాటుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ప్రజలు వాపోతున్నారు. వరదనీటిలో వెళ్ళలేక కొన్ని వాహనాలు వెనక్కు తిరిగి వెళ్ళాయి. రైల్వే వంతెనకు సంబంధించిన రోడ్డును కాంట్రాక్టర్లు ప్రణాళిక ప్రకారం నిర్మించకపోవడంతో ఈ దుస్థితి నెలకొందని వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చేపడుతున్న కాలువ నిర్మాణ పనులను సక్రమంగా చేపట్టాలని వాహనదారులు ,ప్రజలు సంబంధిత అధికారులను కోరుకుంటున్నారు.

02ATP27_02ATP27.qxd 09-08-2025 PM 10:36 Page 1



## వార్త కథనానికి స్పందించిన అధికారులు

గుమ్మఘట్ట ఆగస్టు 09 ప్రభాతవార్త



విద్యుత్ స్థంభం, లీకేజీ నీరు పనులు చేస్తున్న దృశ్యం

**వార్త ప్రభావం**

గోనబావి గ్రామంలో ఎస్సీ కాలానిలో మెయిన్ లైన్ విద్యుత్ స్థంభం ప్రమాదపు అంచుల్లో ఉన్నదని స్థానికులు సర్పంచ్ రాజేష్ ప్రభాతవార్త దృష్టికి తీసుకురావడంతో ప్రమాదపు అంచుల్లో విద్యుత్ స్థంభం అనే శీర్షికతో ప్రభాత వార్తలో విలువడిన కథనం మేరకు అధికారులు స్పందించి అక్కడ ఉన్నటువంటి సమస్య త్రాగునీరు లికేజ్ మరియు మెయిన్ లైన్ విద్యుత్ స్థంభం పక్కకు ఒరగడంతో అంగన్వాడి కేంద్రము సమీపముగా ఉన్న నేపథ్యంలో పిల్లలు కూడా అక్కడే తిరిగేవారు అని స్థానికులు ఇబ్బందులకు గురై భయంక్రాంతులుగా ఉన్నటువంటి సందర్భంలో సంబంధించిన అధికారి ఏ ఈ కు గ్రామ సర్పంచ్ రాజేష్ ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదు నిర్లక్ష్యం చేసారు అందుకే ప్రభాత వార్త కు విన్నవించామని సర్పంచ్ తెలిపారు శనివారము శీర్షిక వెలువడిన తక్షణమే స్పందించి సంబంధిత అధికారులు లీకేజీ అయినటువంటి పైప్ లైన్ ను సరిచేసి విద్యుత్ స్తంభాన్ని సరైన రీతిలో నాటి విద్యుత్ స్థంభం చుట్టూ ఉన్న గుంతను పూర్తిగా మూసివేసి ప్రమాదం నుంచి తప్పించారు స్పందించిన అధికారులకు ప్రభాత వార్తకు కాలనీ వాసులు స్థానికులు సర్పంచ్ రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు

## వర్షానికి దెబ్బతిన్న ఉద్యాన పంటలు

### నూతిమడుగు సమీపంలోని పెన్నా నదిలోకి భారీగా చేరుకుంటున్న వరద నీరు

కంబదూరు, ఆగస్టు 09, ప్రభాతవార్త



వర్షానికి దెబ్బతిన్న అరటి ,టమోట పంటల దృశ్యం (ఇన్ సెట్ లో) మాట్లాడుతున్న రైతు మనోజ్

కంబదూరు మండల వ్యాప్తంగా శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల రైతన్నలు సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. మండల పరిధిలోని రాంపురం గ్రామంలో రైతు మనోజ్ 10 ఎకరాల్లో సాగుచేసిన అరటి, టమోటా పంటలు వర్ష ప్రభావానికి కొట్టుకుపోయాయి. ఈ సందర్భంగా బాధిత రైతు మాట్లాడుతూ భారీగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు .సంబంధిత శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంటను పరిశీలించి తనకు న్యాయం జరిగేలా చూడాలనీ రైతు కోరారు. ఈ వర్షానికి నూతిమడుగు సమీపంలోని పెన్నా నదిలోకి వరద నీరు చేరుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ బాలకిషన్ సూచించారు.

## త్రైత సిద్ధాంతం ఆధ్వర్యంలో శ్రీ కృష్ణ జన్మాష్టమి వేడుకలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 9 ప్రభాతవార్త :



కృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను విడుదల చేస్తున్న దృశ్యం

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ఆహ్వాన పత్రికలను శనివారం స్థానిక సర్కిల్ ఇన్స్పెక్టర్లు నీలకంటేశ్వర్ యువరాజులు విడుదల చేశారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కళ్యాణదుర్గం కమిటీ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కళ్యాణదుర్గం కోట వీధి లో ఆగస్టు 16 నుండి వేడుకలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సమితిఇందూ జ్ఞాన వేదిక కళ్యాణ దుర్గం కమిటీ అధ్యక్షులు,సభ్యులు మేఘరాజు, గణేష్, రామ్మోహన్ రెడ్డి, సాయి, మారుతి, ఆది, రమేష్‌లు పాల్గొన్నారు.

## గర్భవతులకు అన్నదానం



గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి, ఆగస్టు 9 ప్రభాతవార్త

మండల కేంద్రమైన లేపాక్షి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు ఆలయ కమిటీ చైర్మన్ కరణం రామానందన్ పౌష్టికాహారాన్ని అందచేశారు. శనివారం లేపాక్షి పిహెచ్‌సిలో 65 మంది గర్భవతులకు డాక్టర్ వెంకటచిరంజీవి ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వారికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. మధ్యాహ్నం గర్భవతులకు కరణం రామానందన్ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందచేశారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఓ సీతామాలక్ష్మి, ఎంపిహెచ్ఇఒ సుబ్రహ్మణ్యం, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల ఆప్యాయతకు అనుబంధానికి ప్రతీకగా రక్షాబంధన్

### పండుగ వాతావరణంలో అన్నా, తమ్ముళ్లకు రాఖీలు కట్టిన అక్క,చెల్లెమ్మలు

తాడిమర్రి ఆగస్టు 9 (ప్రభాతవార్త)



అన్నలకు రాఖీ కడుతున్న చెల్లెమ్మ

అన్నా చెల్లెల్లు అక్క తమ్ముళ్ల అనురాగానికి అనుబంధానికి ప్రతీకగా నిలిచే రక్షాబంధన్( రాఖీ) వేడుకలను మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా జరుపుకున్నారు. వయస్సుతో సంబంధం లేకుండా చిన్నపిల్లలకు మొదలుకొని వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ అన్నా తమ్ముళ్లకు అక్క, చెల్లెమ్మలు, రాఖీలు కట్టి స్వీట్లు తినిపించి ఆశీర్వాదాలు పొందారు. రాఖీలు కట్టించుకున్న సోదరులు అక్కచెల్లెమ్మలకు పసుపు, కుంకుమ, పువ్వులు, పళ్ళు అందజేసి తగిన బహుమతులు అందజేసి ఆశీర్వదించారు. ప్రతి ఏటా శ్రావణ మాసంలో వచ్చే రక్షాబంధన్ వేడుకలతో అన్నా తమ్ముళ్లు అక్క చెల్లెమ్మలు కుటుంబ సభ్యులు అందరూ ఒక్కచోట చేరి సుఖ సంతోషాలతో పండుగను జరుపుకోవడం కలకాలం గుర్తుండిపోతుందని సంతోషం వ్యక్తం చేశారు.

## ప్రతి కార్యకర్త కష్టపడి వైసీపీ విజయానికి దోహదపడాలి-సమన్వయకర్త మెట్టు



కార్యకర్తలతో మాట్లాడుతున్న మెట్టు

కనేకల్లు ఆగస్టు 09 ప్రభాతవార్త

ప్రతి కార్యకర్త పార్టీకి పట్టుకొమ్మలు ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేసే 2029 లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయానికి దోహదపడాలని రాయదుర్గం వైసీపీ సమన్వయకర్త మెట్టు గోవింద్ రెడ్డి సూచించారు. శనివారం కనేకల్ మండల పరిధిలోని రచ్చుమర్రి గ్రామం నందు రాయదుర్గం వైఎస్ఆర్సిపి సమన్వయకర్త మెట్టు గోవింద రెడ్డి పర్యటించి కార్యకర్తలతో కలిసి పార్టీకి కష్టపడి పని చేయండి కొద్దిరోజుల్లోనే స్థానిక సంస్థలు ఎలక్షన్‌లో ఉంటాయి కలిసిమెలిసిగా పనిచేసే విజయాన్ని సాధించాలని కోరారు ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి వైసీపీ బీసీ విభాగ జిల్లా ఉపాధ్యక్షులు హళ్లి నాగరాజు మాజీ రూరల్ బ్యాంక్ అధ్యక్షులు మారంపల్లి మారెన్న ఆది సద్గురు ఫర్టిలైజర్స్ చంద్రశేఖర్ రెడ్డి మాజీ కన్వీనర్ ఆలూరు చిక్కన్న వేమన్న తదితరులు పాల్గొన్నారు.

## రైతులను అన్ని విధాల ఆదుకొనేలా చర్యలు చేపట్టాలి

### అఖిల భారత్ రైతు సంఘం



విలేకరు సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కనేకల్లు ఆగస్టు 09 ప్రభాతవార్త

దేశానికి అన్నం పెట్టే రైతులను అన్ని విధాల ఆదుకునేలా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలని ఏపీ రైతు సంఘం సభ్యులు అన్నారు. స్థానిక సిపిఐ కార్యాలయం నందు విలేకరుల సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి ఎం గౌస్ పీర్ ఏపీరైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ముల్లా శర్మాస్ వలి మాట్లాడుతూ అనంతపురం జిల్లా వ్యాప్తంగా మెట్ట భూములు వేలాది ఎకరాలు ఉన్నాయి ఈ భూముల్లో తడి పంటలు పండించాల్సినవి పంటలు1 మొక్కజొన్న2 కంది3 జొన్నలు4 సద్దలు5 కొర్రలు6 ఉలువలు 7 అలసందలు 8 పెసులు 9 సన్నాఫ్ లవర్ 10 పత్తి11 మీరప్పా 12 పప్పు చనగ 13 వేరుశనగ ఇలాంటి చిరుధాన్యాలు మెట్ట భూములలో బోర్ భావి ద్వారా పండించాల్సినది కానీ ఇలాంటి పంటలు పండించకుండా కేవలం ప్రతి ఒక్కరూ వరి పండించడం వల్ల నిత్యవసర సరుకులు వేరే రాష్ట్రాల నుంచి తెప్పించుకోవడం వల్ల అధిక రేట్లు ఆకాశానికి అంటుతున్నాయి అన్నారు.ప్రతి సామాన్య కుటుంబాలు సరుకులు కొనలేని పరిస్థితి మూడు పూటలు తినలేక ఒక్కపూట తినే పరిస్థితి కానీ మెట్ట భూములలో చిరుధాన్యాలు పండిస్తే ఆ పంటలకు గిట్టుబాటు ధరలు వస్తాయి ఇలాంటి పంటలు పండించకుండా కేవలం వరి పండిస్తున్నారు మన మండలాల్లో హెచ్ఎల్సీ లోక్లేషన్ ఆయకట్ట కిందఈ భూములలో వరి పండించేవారు వారి పొలాలకు సరిపడే ఎరువులు మందులు రైతు భరోసా కేంద్రాల నుండి మరియు సహకార బ్యాంకు మరియు సహకార ఆంధ్ర బ్యాంకు ద్వారా వరి పండించే ప్రతి రైతులకుప్రభుత్వం నుండి ఎరువులు అందించేవారు ఇవాళ అలాంటి పరిస్థితి లేదు అన్నారు .ఎందుకంటే దీనికి కారణం వ్యవసాయ అధికారులు రైతుల భూములు దగ్గరికి వెళ్లి రైతులకు వారి మెట్ట భూములలో ఏ ఏ రకాలు పంటలు పెట్టాలో రైతులకు అవగాహన కల్పించాలి వారి మెట్ట భూములలో తడి పంటలు పండించడానికి ప్రభుత్వం నుండి చిరుధాన్యాల విత్తనాలు రైతులకు అందించాలి అలా చేస్తే ప్రతి ఒక్కరూ రకరకాలు పంటలు పండిస్తే మన భారత దేశంలో నిత్యవసరుకులు ధరలు పూర్తి తగ్గుతాయి కాబట్టి ప్రభుత్వ అగ్రికల్ అధికారులు రైతులకు వారి మెట్ట భూములలో వరి పండించడం వల్ల చిరుధాన్యాలు పంటలు పూర్తిగా తగ్గిపోతాయి కాబట్టి వరి పంట తగ్గించాలి చిరుధాన్యాలు పంటలు పెంచాలి రకరకాల పంటలు పెట్టే విధంగా చోరువా తీసుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీ మరియు ఏపీ రైతు సంఘం తరపున ప్రభుత్వాని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## రాళ్ళపల్లి లో ఆకట్టుకున్న ఉచిత వైద్య శిబిరం

### 150 మంది రోగులకు చికిత్సలు ఉచిత మందుల పంపిణీ

మడకశిర, ఆగస్టు 9 ప్రభాతవార్త :



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ శ్రీనివాస్ నాయక్

మైసూరు సర్వ ధర్మ ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మమత అమ్మవారి ఆధ్వర్యంలో శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గం లోని గుడిబండ మండలం రాళ్లపల్లి గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం రోగులను ఆకట్టుకుంది.



రక్తపోటు మధుమేహం పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస నాయక్, డాక్టర్ లిఖిత రెడ్డి రోగులను పరీక్షించి వైద్య సలహాలతో పాటు మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రోగులకు మధుమేహం రక్తపోటు రక్త పరీక్షలు నిర్వహించి అవసరమైన వైద్య సలహాలను అందజేశారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో 150 మందిలో అధిక శాతం వయోవృద్ధులు మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీనివాస్ నాయక్ లిఖిత్ రెడ్డి మాట్లాడుతూ సర్వ ధర్మ ఆశ్రమం ఆధ్వర్యంలో ప్రతినెల వైద్య సేవలు అందుకోలేని మారుమూల గ్రామాలను ఎంచుకొని ఉచిత వైద్య శిబిరాలను నిర్వహించడం పేద ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందని తెలిపారు. మాజీ సర్పంచ్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమ గ్రామంలో సర్వధర్మ నిలయం ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి తమ గ్రామ ప్రజలకు వైద్య సేవలను అందించి ఆరోగ్య పరిక్షణకు కృషి చేయడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. సర్వధర్మ నిలయం ట్రస్ట్ సభ్యులు రామచంద్రరావు మాట్లాడుతూ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మమతమ్మ అమ్మవారి ఆశీస్సులతో మారుమూల గ్రామమైన రాళ్లపల్లిలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించడం పేదలకు ఉపయోగపడిందని, ట్రస్టు ఆధ్వర్యంలో విద్య వైద్య రంగాలలో పేదలకు సేవలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉచిత వైద్య శిబిరంలో డాక్టర్లతో పాటు వైద్య సిబ్బంది విజయలక్ష్మి లక్ష్మీనరసమ్మ మమత గాయత్రి అర్చన సునీత హర్షవర్ధన్ జ్ఞానమ్మ నరసింహులు సంతోష్ తదితరులు విలువైన సేవలు అందించాలని కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ సద్గురు అన్వరానంద బాబా శిష్య భక్తాదులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరంగనాథుని కళ్యాణోత్సవం



కళ్యాణోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త

మండలంలోని జక్కలచెరువు గ్రామంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీబొలికొండ రంగనాథస్వామి కళ్యాణోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రావణమాసం పురస్కరించుకొని కళ్యాణోత్సవాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ కళ్యాణోత్సవంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న గుత్తి టిడిపి ఇన్‌చార్జ్ గుమ్మనూరు ఈశ్వర్ స్వామివారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలంతా సుఖశాంతులతో జీవించాలని, వరుణదేవుని కరుణతో వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని ఆయన కోరుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ కన్వీనర్ ఎంకె చౌదరి, మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్, గుత్తి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు చికెన్ శీనాయాదవ్, ఓంప్రకాష్, గోవర్ధన్, దాదు, తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా గుత్తికోటలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించారు. అనంతరం హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## మాదిగల చైతన్య సదస్సులు జయప్రదం చేయండి



ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతున్న దృశ్యం

గుత్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త

జిల్లా కేంద్రంలో జరగనున్న మాదిగల చైతన్య సదస్సులు జయప్రదం చేయాలని మండల ఎంఆర్‌పిఎస్ జిల్లా నాయకులు ఈరన్న కోరారు. శనివారం స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాదిగల సమస్యల పరిష్కారంపై వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి మండల వ్యాప్తంగా మాదిగలు పెద్దఎత్తున తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ రాజు, నాయకులు నాగేంద్ర, ఓబులేసు, అయ్యప్ప, రంగడు, చంద్ర, సుధాకర్, రంగా, వెంకటేష్, లక్ష్మన్న, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న దృశ్యం

అమరాపురం ఆగస్టు 9 ప్రభాతవార్త

మండలంలోని అమరాపురం మండల కేంద్రం నుండి బంగారుపాళ్యం నకు1.20కోట్లు, అమరాపురం నుండి వీరాపురం రోడ్డుకు కోటి రూపాయలు రోడ్డు పనులు నిర్మాణమునకు మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామిలకు తెలుగుదేశం పార్టీనాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. టిడిపికార్యాలయం నందు టిడిపి మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి,సహకారసంఘం అధ్యక్షుడు గణేష్, ప్రధానకార్యదర్శి నాగరాజు, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మండల క్లస్టర్ కన్వీనర్ నవీన్‌కుమార్ ,జడ్పిటిసి పిఆర్ నరసింహమూర్తి తదితరులసమక్షంలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో మడకశిర నియోజకవర్గంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్సీల ఆధ్వర్యంలో అభివృద్ధి సంక్షేమకార్యక్రమాలు ఊపందుకు న్నాయని పేర్కొన్నారు. గతవైకాపాప్రభుత్వంలో నియోజకవర్గంలో అభివృద్ధికుంటుపడిందని ఆరోపించారు. మండలంలో కోట్లాది రూపాయలతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు నిధులుమంజూరుపట్ల హర్షం వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో టిఎన్టియుసి ఉపాధ్యక్షుడు గొల్లమారనపల్లి రామచంద్రప్ప, యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, వాల్మీకి మంజునాథ్, యూనిట్ ఇన్చార్జులు నిరంజన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

## గర్భధారణ సమయంలో మహిళలకు స్వీయ సంరక్షణ గురించి సరైన సమాచారం అందించండి

### చోరనూరు పీ హెచ్ సి సందర్శించిన డిహెచ్ఓ డా.వై.రమేష్ బాబు

బళ్లారి, ఆగస్టు9(ప్రభాతవార్త):

జిల్లా ఆరోగ్య , కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ యల్లా రమేష్ బాబు గర్భధారణ సమయంలో స్వీయ సంరక్షణ గురించి ఇంట్లో గర్భిణీ స్త్రీలకు సలహాలు మరియు సరైన సమాచారం అందించాలని ప్రాథమిక ఆరోగ్య అధికారులను ఆదేశించారు. సండూర్ తాలూకాలోని చోరనూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించి మాట్లాడారు. ప్రతి నెల 9వ తేదీన జరిగే ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ దినోత్సవం సందర్భంగా సమస్యలతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలు వైద్య అధికారులచే వారి ఆరోగ్యాన్ని తనిఖీ చేయించుకోవడానికి జాగ్రత్త వహించాలని ఆయన అన్నారు. ప్రసవ పూర్వ సంరక్షణలో వైద్య పరీక్ష, వైద్యుల సలహా మరియు ఆరోగ్య విద్యను అందించాల్సిన అవసరం ఉందని, ప్రసవ సమయంలో సంరక్షణ పద్ధతులుండేలా చూడాలని ఆయన అన్నారు. ఎటువంటి సమస్యలు లేకపోయినా, గర్భిణీ స్త్రీలు గర్భధారణ సమయంలో కనీసం 4 సార్లు ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, వైద్యుల సలహా మేరకు ఆరోగ్య పరీక్షలు,రక్త పరీక్ష చేయించుకోవాలి. గర్భధారణ సమయంలో తల్లులకు ప్రమాద సంకేతాల గురించి అవగాహన కల్పించాలి. వైద్యుల సలహా లేకుండా ఎటువంటి మందులు తీసుకోవద్దని వారికి సూచించాలని డి హెచ్ ఓ సూచించారు. వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో, ఇంటి చుట్టూ నీరు నిలిచి ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించాలి. నిల్వ ఉన్న నీటిలో దోమలు వృద్ధి చెందడం వల్ల డెంగ్యూ ,మలేరియా, చికున్‌గున్యా వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉందని, దీనిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. తల్లి తల్లిపాలు బిడ్డకు తల్లిపాలు అమృతం లాంటివని తప్పనిసరిగా 6 నెలలపాటు ఇవ్వాలన్నారు.దశలవారీగా పసిబిడ్డలకు టీకాలు వైద్యులు సూచన మేరకు తేదీల ప్రకారం వేయించాలని చెప్పారు.స్థానిక వైద్యులు, పిహెచ్ సి సిబ్బంది పాల్గొన్నారు.

## అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పౌర్ణమి

బత్తలపల్లి, ఆగస్టు 9 ప్రభాతవార్త



సోదరునికి రాఖీ కడుతున్న సోదరీమణులు

అన్నా, చెల్లెళ్ళు, అక్క తమ్ముళ్ల అనుబందానికి ప్రతీకైన రాఖీపౌర్ణమి వేడుకలను మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో ఘనంగా నిర్వహించుకున్నారు. శనివారం మండలంలోని ప్రతి అక్క, చెల్లెలు తమ సోదరులకు రాఖీలు కట్టి ఈ వేడుకలను జరుపుకోవడం విశేషం. రాఖీ జరుపుకునేందుకు పండితులు సూచించిన శుభగడియలలో చిన్న,పెద్ద తారతమ్యం లేకుండా ఒకరినొకరు రాఖీలు కట్టుకున్నారు.ప్రతి ఏటా శ్రావణమాసంలో వచ్చే శ్రావణ పౌర్ణమి రోజున ఈ వేడుకలను నిర్వహిస్తుంటారు. చిన్నారులు మొదలుకొని వృద్ధుల వరకు తమ సోదరులకు రాఖీలు కట్టి ఆశీర్వాదాలు పొందారు. ఆయా పాఠశాలల విద్యార్థులు తమ తోటి విద్యార్థులతో రాఖీలు కట్టించుకున్నారు. అనంతరం దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.రాఖీ కట్టించుకున్న ప్రతి సోదరుడు తమ సోదరికి ఆర్థిక పరిస్థితులకు అను గుణంగా బహుమతులను, నగదును,వస్త్రాలను అందజేయడం విశేషం. పౌర్ణమి వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించాయి. దూర ప్రాంతాల్లో ఉన్నవారు సైతం తన సోదరుల వద్దకు వెళ్లి రాఖీలు కట్టి మిఠాయి తినిపించి ఆశీర్వాదాలు పొందారు.

## రస్తాకు అడ్డుగా నిర్మిస్తున్న తొట్టిగోడనిర్మాణం నిలిపివేయాలి

వజ్రకరూరు ఆగస్టు 9 ప్రభాతవార్త

మండల పరిధిలోని తట్రకల్లు గ్రామంలో ఎన్ఎస్‌పి తండా రహదారి వంక నుండి రామక్క బావి పొలాలకు వెళ్లే రస్తాలో గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తొట్టిగోడను నిర్మిస్తున్నారని దీని నిలిపివేయించాలని గ్రామానికి చెందిన రైతులు శనివారం వజ్రకరూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఈ రస్తా లో 500 మందికి పైగా రైతులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ప్రభుత్వ భూమిని సాగును చేసుకుంటున్నా ఇద్దరు వ్యక్తులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ హద్దులు దాటి తొట్టి గోడను నిర్మించుకుంటున్నారన్నరని ఎస్సై నాగస్వామికి తెలిపారు. దీంతో వారికి తీవ్ర ఇబ్బంది కలుగుతుందన్నారు. ప్రస్థానం పరిశీలించి, విచారించి ఇబ్బంది లేకుండా చూస్తానని రైతులకు ఎస్సైహామీ ఇచ్చారు. ఎటువంటి తొందరపాటి చర్యలకు పాల్పడవద్దని రైతులకు సూచించారు.

## ఇళ్లలోకి వర్షపు నీరు

వజ్రకరూరు ఆగస్టు 9 ప్రభాతవార్త



వీధిలో నిలిచిన వర్షపునీరు

మండలంలోని కొనకొండ్ల గ్రామంలో లింగాల గుడివెనక ముందు చూపు లేకుండా ఇష్టానుసారంగాసీసీ రోడ్డువేయడంతో సమీప ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి ప్రజలకు తీవ్ర ఇబ్బందులకు గురి అవుతున్నారు. రోజుల తరబడి వర్షంనీరు ముందుకు కదలక పరిసర ప్రాంతాలు మురికి కూపాలుగా మారుతున్నాయి. దోమలు ప్రబలి తీవ్ర అనారోగ్యాలకు గురి అవుతున్నారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో జ్వరాలు ప్రబలి అనేకమంది అనారోగ్యానికి గురయ్యారు. పంచాయతీ అధికారులను సంప్రదించిన మరి ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యను పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

## జగన్‌కు చిత్తశుద్ధి ఉంటే దళితులపై దాడి చేసిన వారిని పార్టీ నుండి బహిష్కరించాలి

### మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్...

పుట్టపర్తి (కల్చరల్) ,ఆగస్టు 9, ప్రభాతవార్త



ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే దళితులపై దాడి చేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను, రౌడీలను వైసీపీ నుండి బహిష్కరించాలని మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ బేకరీ గంగాధర్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన పుట్టపర్తిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళిత ద్రోహి అని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ దళిత వ్యతిరేక పార్టీ అని దుయ్యబట్టారు. ఆయన అధికారంలో ఉన్నప్పుడు దళితులపై హింస, దౌర్జన్యం అక్రమ కేసులు బనాయించి తీవ్ర ఇబ్బందులు పెట్టాడని, దళిత హక్కులు, భద్రత, గౌరవం పట్ల జగన్కు గాని, వైసిపి పార్టీకి గాని ఎలాంటి అభిమానం లేదన్నారు. వైకాపా ప్రజాస్వామ్యంలో క్రూర రాజకీయాలు నడుపుతోందన్నారు. పలనాడులో దళిత వృద్ధుడు సింగయ్యను తన కారుతో తొక్కించి భార్యను బెదిరించి తప్పుడు వాంగ్మూలం ఇప్పించడం ప్రస్తుతం అదేతంతును కొనసాగించడం వైయస్సార్ పార్టీ శ్రేణులకే చెల్లుతుందన్నారు. ప్రజాస్వామ్యంలో చట్టం అందరికీ సమానమేనని దళిత,బలహీన వర్గాలపై హింసచర్యలు పురిగొలిపితే భారీమూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. తప్పుచేసి కొట్టడానికి, తప్పు తాగి కొట్టడానికి తేడా తెలియని అమాయకులు ఎవరూ లేరని, వైసిపి బొంకు రాజకీయాలను మానుకోవాలని హితవు పలికారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు దళితులపై దాడులు మానుకోకపోతే ఆ పార్టీ కి దళితులు త్వరలోనే తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు.

## సోమందేపల్లిలో తప్పిన ట్రాఫిక్ సమస్యలు



రోడ్డు విస్తరణ జరుగుతున్న పనులు

సోమందేపల్లి ఆగస్టు 9. ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఎన్టీఆర్ సర్కిల్ లో డివైడర్ వల్ల ఎంతో ఇబ్బందిగా వాహనాల రాక పోకలకు ఉండేది, అయితే అటు ఇటు వైపు ఉన్న డివైడర్ల ను తొలగించడం తో ట్రాఫిక్ సమస్య తీరిందని ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు గతంలోఈ విషయాన్ని గమనించిన కూటమి నేతలు అన్ని కులాల పెద్దలతో మాట్లాడి డివైడర్ లను తొలగించడానికి అందరి అనుమతులతో ముందుకు వెళ్లారు ,ఇందులో భాగంగా కూటమి నేతలైన కన్వీనర్ వెంకటేష్,రాష్ట్ర వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆంజనేయులు, హిందూపురం పార్లమెంటు తెదేపా కార్యదర్శి చంద్రశేఖర్,మాజీ కన్వీనర్ సిద్ధలింగప్ప,పట్టణ అధ్యక్షుడు వడ్డే సూరి,సోమందేపల్లి మండల తెదేపా కార్యదర్శి సూర్యనారాయణ,మాజీ ఎంపీటీసీ కిష్టప్ప తదితరులు డివైడర్ తగ్గింపు పనులు దగ్గరుండి చేయిస్తున్నారు,ఇన్నాళ్లకు ట్రాఫిక్ సమస్య తీర్చినందుకు ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

03ATP09_03ATP09.qxd 09-08-2025 PM 10:37 Page 1



## వైసిపి పాలనలోనే గిరిజనుల అభ్యున్నతి

- ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్
- వైసిపి కార్యాలయంలో ఘనంగా గిరిజన దినోత్సవం



కేక్ కట్ చేస్తున్న గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్

**అనంతపురం సిటీ, ఆగస్టు 9 ప్రభాతవార్త**

వైసిపి పాలనలోనే గిరిజనుల సంక్షేమం సాధ్యమైందని వైసిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులునాయక్ పేర్కొన్నారు. గిరిజన దినోత్సవాన్ని పురస్కరించుకుని వైసిపి జిల్లా కార్యాలయంలో ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్‌నాయక్ ఆధ్వర్యంలో కేక్ కటింగ్ నిర్వహించి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన పక్షపాతిగా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గిరిజనుల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను అందించడంతోపాటు రాజకీయ ప్రాధాన్యతను కల్పించారని కొనియాడారు. గిరిజన పేదలకు భూ పంపిణీ చేపట్టి వారు ఆర్థికంగా బలోపేతం అయ్యే దిశగా పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో మేయర్ మహ్మద్ వసీం, గిరిజన సంఘం నేతలు సాకే చిరంజీవి, గుజ్జల శివయ్య, సాకే శ్రీనివాసులు, రాజునాయక్, అశ్వర్థనాయక్‌లతోపాటు పలువురు నేతలు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ జిల్లా మహాసభలు జయప్రదం చేయండి

- సిపిఐ రవీంద్ర



మాట్లాడుతున్న సిపిఐ నేత రవీంద్ర

**రాప్తాడు, ఆగస్టు 9 ప్రభాతవార్త**

మండల కేంద్రంలో శనివారం భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ జిల్లా కార్యాలయంలో రాప్తాడు మండల శాఖా కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి రాప్తాడు మండల కార్యదర్శి ఆర్.రవీంద్ర మాట్లాడుతూ.. అనంతపురం జిల్లాలో కరువు నివారణ, సాగునీరు, త్రాగునీరు సాధించడం కోసం అనేక నీటి ప్రాజెక్టు నిర్మాణానికి పోరాడినది సిపిఐ పార్టీ అనంతపురం జిల్లాలో ఉద్యోగ, కార్మిక సమస్యల సాధన, సమాన పనికి సమాన వేతనం, కనీస వేతనాలు, శాశ్వత పని ఉన్నచోట శాశ్విత ఉద్యోగుల కల్పన, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలకు ప్రత్యేక చట్టం, వ్యవసాయ రుణాలు రద్దు, మహిళ సాధికారత, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాలు నిర్మూలన, విద్యారంగ సమస్యల పరిష్కారం, నిరుద్యోగ భృతి, యువతకు ఉద్యోగ ఉపాధి కల్పన సమస్యలపై అనునిత్యం పోరాటం కొనసాగుతున్న పార్టీ ఏకైక పార్టీ సిపిఐ పార్టీ అని రవీంద్ర అన్నారు. అదేవిధంగా రాప్తాడు మండలంలో ఉన్న సమస్యలపై భవిష్యత్ కార్యచరణ ఈ మహాసభల్లో నిర్ణయాలు తీసుకుంటాం, సిపిఐ జిల్లా మహాసభలు ఈనెల 12, 13 తేదీల్లో అనంతపురం నగరంలో జరగబోతున్నాయి. 12వ తేదీన ఆర్ట్స్ కళాశాల నుంచి టవర్ క్లాక్ సప్తగిరి సర్కిల్ మీదుగా పెద్ద ఎత్తున ర్యాలీగా వెళ్లి కెఎస్ఆర్ కళాశాలలో బహిరంగ సభ కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. 13వ తారీఖున నగరంలో కనకదాసు కళ్యాణ మండపం (గుత్తి రోడ్డు)లో ప్రతినిధుల సభ నిర్వహిస్తున్నామని, కావున ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరుతున్నామన్నారు. ఈ సమావేశంలో సహాయ కార్యదర్శి చలపతి, శాఖ కార్యదర్శులు ఆదినారాయణ, సంజీవులు, ప్రసాద్, విశ్రాంతి తదితరులు పాల్గొన్నారు.

## యస్‌వి డిగ్రీ కళాశాలలో "సంస్కృత భాషాదినోత్సవ" వేడుకలు

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త**



సంస్కృత భాష దినోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

స్థానిక యస్ వి డిగ్రీ కళాశాలలో శనివారం సంస్కృత విభాగం ఆధ్వర్యంలో "సంస్కృత భాషా దినోత్సవ" వేడుకలు ఘనంగా జరిగాయి. కళాశాల వైస్ చైర్మన్ సి.చక్రధర్ రెడ్డి దీప ప్రజ్వలనం గావించి కార్యక్రమానికి స్వాగతం పలికారు. ప్రాచీన భారతీయభాష సంస్కృతం పై అవగాహన కల్పించేందుకు, ప్రోత్సహించడానికి, పునరుజ్జీవనం కల్పించేందుకు సంస్కృత భాషా దినోత్సవం జరుపుకుంటారన్నారు. ఇది కేవలం భాష మాత్రమే కాదు, గౌరవించాల్సిన సంస్కృతి, ప్రతి ఒక్కరూ సంస్కృతం పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ యన్.వి. ప్రసాద్ మాట్లాడుతూ.. ప్రపంచంలోనే అత్యంత శాస్త్రీయ భాష అయిన సంస్కృతాన్ని రక్షించి ప్రచారం చేయాలన్నారు. పండితులుగా, యోగులుగా, కవులుగా, ఋషులుగా, గొప్ప నాయకులుగా, తీర్చిదిద్దడానికి, శాస్త్రాలన్నీ సంస్కృతంలోనే జన్మించాయన్నారు. సంస్కృత శాఖాధిపతి డా.అంకె ఆదెప్ప మాట్లాడుతూ..భారతదేశంలో సంస్కృతం ఒక క్లాసికల్ భాష, "8"షెడ్యూల్ భాష అని, దేశ సాంస్కృతిక వారసత్వానికి సంస్కృతం కిటికీ లాంటిద న్నారు. ఈ సందర్భంగా జరిపిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో నెగ్గిన విద్యార్థులకు బహుమతులు వైస్ చైర్మన్ చేతులమీదుగా అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో హింది శాఖాదిపతి డా.శ్రీనివాసులు తెలుగు శాఖాదిపతి డా.మురళి, ఏవో శ్రీనాథ్, అధ్యాపక, అద్యాపకేతర బృందం పాల్గొనింది.

## అదనపు సీట్లకు దరఖాస్తు చేసుకోండి

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త**

డాబిఆర్.అంబేద్కర్ గురుకులం రొళ్ల స్కూల్‌కి ఈ సంవత్సరం 5, 6, 7, 8, 9, 10 తరగతులకు అదనపు సీట్లు సెక్రెటరీ, కలెక్టర్ చొరవతో మంజూరు చేసినట్లు డిసిఓకె జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9 తరగతులకి జూన్ 25న జరిగిన ప్రవేశ పరీక్ష రాసిన వారిలో మెరిట్ విద్యార్థుల ద్వారా భర్తీ చేశామన్నారు. 5వ తరగతికి బిఆర్ఎజి సిఇటి రాసిన వారిలోని మెరిట్ ఆదారంగా భర్తీ చేసినట్లు తెలిపారు. 8, 9, 10వ తరగతులకి పేరెంట్స్ ఇచ్చిన అర్జీల ద్వారా (పిజిఆర్ఎస్, ఆఫీస్‌కి వచ్చిన అర్జీలలో నుండి), కౌన్సిలింగ్ అటెండ్ అయిన వారితో భర్తీ చేస్తామని డిసిఇఓ జయలక్ష్మి తెలిపారు. ఇవి అదనపు సీట్లు కాబట్టి రొళ్ల స్కూల్‌లో చేరిన తరువాత వారికి బదిలీలు వుండవు అని తెలియజేశారు. ఈ సీట్లు అన్ని మెరిట్ ప్రకారం మాత్రమే జరుగును, కావున ఎవరు కూడా ఆఫీసు వారిని కానీ, స్కూల్‌లో ఉన్న స్టాఫ్‌ని కానీ లేదా ఎవరన్నా కానీ మధ్య వర్తులను నమ్మి మోసపోవద్దండి అని తెలియజేశారు. ఈ సీట్ల కేటగిరి వారీగా జరుగునని ఏ కేటగిరికి అన్న రాకపోతే ఆ సీట్లు అన్ని ఎస్సీ-2 ద్వారా అదే రోజు భర్తీ చేస్తామని తెలియజేశారు. 5వ తరగతిలో ఎస్సీ2లో 35, ఎస్సీ2లో 35, ఎస్టీ-5, బిసి-4, ఓసి-1, 6వ తరగతికి ఎస్సీ2లో 35, ఎస్సీ-34కి, ఎస్టీ-5, బిసి-4, ఓసి-1, 7వ తరగతిలో ఎస్సీ2లో 35, ఎస్సీ3లో 35, ఎస్టీ-5, బిసి-4, ఓసి-1, 8వ తరగతిలో ఎస్సీ2లో 19, ఎస్సీ-3 : 18, ఎస్టీ-5, ఓసి-1, 9వ తరగతిలో ఎస్సీ2లో 25, ఎస్సీ3లో 25, ఎస్టీ-6, బిసి-2, ఓసి-2, 10వ తరగతిలో ఎస్సీ2లో 35, ఎస్సీ3లో 35, ఎస్టీ-6, బిసి-3 ఖాళీలు ఉన్నట్లు తెలియజేశారు.

## సమగ్ర శిక్షలోని సెక్టోరియల్ పోస్టులలో ప్రతిభకు పట్టం కట్టాలి సామాజిక న్యాయం పాటించాలి

- అర్హుల జాబితా నుండి అనర్హులను తొలగించాలి
- అనంతపురం జిల్లా ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ మెంబర్ నెరమెట్ల యల్లన్న

**అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త**

సమగ్ర శిక్ష అధికారులు చేసిన తప్పే మళ్ళీ మళ్ళీ చేస్తున్నారు. సెక్టోరియల్ అధికారులు లేక కునారిల్లిన జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయంలో అధికారుల నియామకం కోసం ఎట్టకేలకు నోటిఫికేషన్ ఇచ్చారు. కానీ ఆ పోస్టులను భర్తీ చేయకుండా తీవ్ర జాప్యం చేస్తూ వచ్చారు. చివరకు ఎస్పిడి జోక్యం చేసుకొని వెంటనే ఆ పోస్టుల భర్తీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఘాటుగా ఆదేశించారు పోస్టుల భర్తీలో ఎలాంటి రాజకీయాలకు తావు లేకుండా పారదర్శకంగా నిష్పక్షపాతంగా పూర్తి అర్హత కలిగిన ఉపాధ్యాయులనే ఎంపిక చేయాలని కూడా సూచించారు. కానీ ఇక్కడ జరుగుతున్నది వేరు గత నోటిఫికేషన్లో అర్హత లేని వారిని కూడా ప్రస్తుతం ఇంటర్వ్యూకు అర్హత కల్పించారు. వ్యాయామ ఉపాధ్యాయులను ఎలాంటి డిప్యూటేషన్లలో నియమించరాదని విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నప్పటికీ ఒకరిద్దరూ వ్యాయామ ఉపాధ్యాయులు జాబితాలోకి వచ్చారు. అది కాక ఒకరు గతంలో విద్యార్థినులను లైంగిక వేధింపులకు గురిచేసినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటూ ఫోక్సో కేసులో ఇరుక్కున్న ఉపాధ్యాయుడు కానీ ఇతనికి ఒక ప్రజా ప్రతినిధి అండదండలు పుష్కలంగా ఉన్నందున అతను సునాయాసంగా అర్హుల జాబితాలోకి వచ్చాడు. ఇక ఇంటర్వ్యూ అతనికి నల్లేరు మీద నడకే అని అతని మిత్రులు చెబుతున్నారు. అలాగే ఇంకో ఉపాధ్యాయురాలు గతంలో సమగ్ర శిక్ష కార్యాలయంలో పనిచేశారు. కానీ ప్రస్తుతం అర్హుల జాబితాలో ఉన్నారు. ఇంకా ఇలాంటివి చాలా ఉన్నాయి. కానీ అర్హుల జాబితాను పారదర్శకంగా ప్రకటించకుండా కేవలం ఇంటర్వ్యూలకు ఎంపికైన అభ్యర్థులకు ఫోన్ ద్వారా మాత్రమే తెలియజేస్తున్నారు. సోమవారం జరిగే ఇంటర్వ్యూలలో అర్హులుకన్నా అనర్హులకే అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు గుట్టుగా జరుగుతున్న ఈ తంతు స్పష్టం చేస్తోంది. కనుక వెంటనే జాబితాను బహిర్గతం చేసి అనర్హులను తొలగించాలి, ఇంటర్వ్యూలు పూర్తి పారదర్శకంగా నిర్వహించాలి, ఎంపికలో సామాజిక న్యాయం పాటించాలి, రాజకీయ ప్రాపకానికి కాకుండా ప్రతిభకే ప్రాధాన్యం ఇవ్వాలి, జిల్లా జాయింట్ కలెక్టర్ (ఇన్చార్జి కలెక్టర్), అసిస్టెంట్ కలెక్టర్ సమగ్ర శిక్షలోని ఒక అధికారి పక్షపాత వైఖరి తన సామాజిక వర్గం వారికి పోస్టులను కట్టబెట్టాలనే దురాలోచనపై దృష్టిసారించాలి, అవసరమైతే ఇంటర్వ్యూల నుంచి ఆ అధికారిని పక్కకు తప్పించాలి. జిల్లాలో సమగ్ర శిక్ష కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు జరగాలంటే రాజకీయాలకు పైరవీలకు అతీతంగా ప్రతిభ కలిగిన సెక్టోరిల్ అధికారుల ఎంపిక జరగాలి. కేవలం ఒక సామాజిక వర్గానికి సంబంధించిన వారికి కాకుండా సామాజిక న్యాయం పాటించి పోస్టులు ఎంపిక జరగాలి.

## ఎంఎస్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చీమల నల్లప్ప



చీమల నల్లప్ప



యేసయ్య

**శింగనమల, ఆగస్టు 9 ప్రభాతవార్త**

నియోజకవర్గ పరిధిలోని నార్పల మండలం బి.పప్పూరు గ్రామానికి చెందిన చీమల నల్లప్పను ఎంఎస్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అనంతపురం జిల్లా కమిటీ జిల్లా అధ్యక్షులు కె.ఎన్.మూర్తి, అనంతపురం జిల్లా అధ్యక్షులు హెచ్.నాగన్న ఉపాధ్యక్షులు సాకే మల్లేష్‌ల సమక్షంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చీమల నల్లప్ప ఎంఎస్‌పిఎస్ అభివృద్ధి కోసం చేసిన సేవలు అందరి మన్ననలు పొంది తక్కువ కాలంలో పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు పని చేసిన వారి సేవలను గుర్తించి ఎంఎస్‌పిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా చీమలనల్లప్పను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. అలాగే నియోజకవర్గం అధ్యక్షులుగా గార్లదిన్నె మండలం మర్తాడు గ్రామానికి చెందిన యేసయ్యను ఎంపిక చేశారు. అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన చీమల నల్లప్ప మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇంతటి బాధ్యతలు అప్పగించిన ఎంఎస్‌పిఎస్ రాష్ట్ర కమిటీకి, జిల్లా కమిటీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానని, ఇక నుంచి మరింత శక్తి వంచన లేకుండా జిల్లా వ్యాప్తంగా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

## హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త**

హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాని బిజెపి నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోడీ పిలుపుమేరకు దేశం మొత్తం హర్ ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరు ఇంటి మీద జాతీయ జెండా ఎగుర వేసి దేశ ఐక్యతను మరియు దేశ సమగ్రతను పెంపొందించే విధంగా నిర్వహించాలని, అలాగే తాడిపత్రి పట్టణంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించాలన్నారు. అలాగే స్వాతంత్ర సమరయోధుల విగ్రహాలను శుభ్రం చేసి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించాలని తెలియచేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, తాడిపత్రి హర్ ఘర్ తిరంగా తాడిపత్రి నియోజకవర్గ ఇన్‌చార్జ్ దుద్దకుంట వెంకటేశ్వరరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ కన్వీనర్ పివి ప్రతాప్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మైదుకూరు ఆంజనేయులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చవ్వ రంగనాథ్‌రెడ్డి, సీనియర్ నాయకులు సింగిరి లక్ష్మినారాయణ, రజక కార్పోరేషన్ డైరెక్టర్ వై.రామాంజనేయులు, గ్రంథాలయ కన్వీనర్ పోతుల గంగాధర్‌యాదవ్, చేనేత సెల్ కన్వీనర్ పి.నారాయణస్వామి, తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు యు.కృష్ణమోహన్‌రాజు, తాడిపత్రి పట్టణ ప్రధాన కార్యదర్శి జూటూరు ఓబిరెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు వై.వీరభద్రుడు, మైనార్టీ రూరల్ అధ్యక్షుడు జమాల్, తాడిపత్రి రూరల్ మాజీ అధ్యక్షుడు రాంబాబు, వంశీ, చంద్ర, జిల్లా ప్రోగ్రాం కన్వీనర్ చెన్నా రంగనాయకులు,ఈశ్వరయ్య, కరుణాకర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పైపులైన్‌కు మరమ్మతు పనులు

**తాడిపత్రిటౌన్, ఆగస్టు 9 ప్రభాతవార్త**

పట్టణంలోని 27వ వార్డు ఆసుపత్రిపాలెంలోని వాటర్ ట్యాంకు సంబంధించిన పైప్ లైన్‌కు వార్డు కౌన్సిలర్ రేష్మపర్వీన్ శనివారం మరమ్మతు పనులు చేయించారు. పైపులైన్ పగిలిపోయి నీరు బయటకు వచ్చి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకూడదన్న ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, మున్సిపల్‌చైర్మన్ జె.సి ప్రభాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పైపులైన్‌కు మరమ్మతు పనులు చేయించారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.



మరమ్మతులు చేస్తున్న దృశ్యం

## వన్ టౌన్ సీఐగా వెంకటేశ్వర్లు

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 9 ప్రభాతవార్త**



సీఐ వెంకటేశ్వర్లు

అనంతపురం నగరంలోని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ నందు శనివారం సీఐగా వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. గత మూడు నెలల క్రితం అప్పటి సీఐ రాజేంద్ర యాదవ్ కొన్ని అవాంతర కారణాలవల్ల జిల్లా ఎస్పీ పి జగదీష్ వి ఆర్ పంపించారు. ఒక కేసు విషయంలో నిర్లక్ష్యం చేసినందు వల్ల ఎస్పీ అప్పుడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. అప్పటినుండి జిల్లా ఎస్పీ ఆదేశాలతో రెండో పోలీస్ స్టేషన్ సిఐ శ్రీకాంత్ యాదవ్ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒకటో పోలీస్ స్టేషన్ పరిధిలో ఎక్కువగా క్రైమ్ రేట్ పెరుగుతున్నందువల్ల ఎట్టికేలకు శనివారం సీఐ వెంకటేశ్వర్లు బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం తమ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## నేత్రదానం అన్ని దానాల కన్నా మిన్న



నేత్రాలను దానం చేస్తున్న మృతురాలి కుటుంబ సభ్యులు

**అనంతపురం వైద్యం ఆగస్టు 9 ప్రభాతవార్త**

నేత్రదానం అన్ని దానాల కన్నా మిన్న అని సాయి ట్రస్ట్ అధ్యక్షుడు విజయ్ సాయికుమార్ అన్నారుశనివారం అనంతపురం నగరంలోని సాయి నగర్ 3వ క్రాస్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజి విశ్రాంత ఆచార్యులు కీ.శే పద్మనాభయ్య సతీమణి శ్రీమతి నర్మదమ్మ (82 సం.) మరణించిన విషయం తెలుసుకున్న సాయి ట్రస్ట్ బృందం వారి నిన్న మధ్య రాత్రి ఆమె కుమారులు కుమార్ మరియు కిషోర్‌లకు నేత్రదానం పై అవగాహన కలిగించి అంగీకార పత్రాల్లో సంతకం తీసుకునిఅనంతరం ఎల్.వి ప్రసాద్ ఆసుపత్రికి చెందిన ఆప్తమాలిక్ అసిస్టెంట్ యు.ప్రసాద్ ఆమె యొక్క రెండు నేత్రాలను సేకరించి హైదరాబాద్ కు తరలించారు. ఈమె నేత్రదానం తో మరో ఇద్దరికి కంటి చూపు కలిగించగలిగామని వారి కుటుంబ సభ్యులకు సాయి ట్రస్ట్ తరుపున కృతజ్ఞతలు తెలియజేసి ప్రశంసా పత్రం అందజేశారు. ఈ కార్యక్రమం లో సాయి ట్రస్ట్ విజయభాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు



రాఖీ పౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న జనసేన పార్టీ మహిళా కార్యకర్తలు

**అనంతపురం వైద్యం ఆగస్టు 9 ప్రభాతవార్త**

అనంతపురం జిల్లా జనసేన పార్టీ ఆధ్వర్యంలో రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టి సి వరుణ్ ఆధ్వర్యంలో మహిళా కార్యకర్తలకు చీరలు చేశారు.ఈ సందర్భంగా వరుణ్ మాట్లాడుతూ. మహిళల పక్షపాతి ప్రభుత్వం మాది అని, కూటమి ప్రభుత్వంలో ఆడపడుచులకు అండగా దీపం 2, ప్రతిష్టాత్మకంగా తల్లికి వందనం.. ఆగస్టు 15న స్త్రీ శక్తి ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం అమలు చేస్తోందన్నారు. అనంతలో అహుడ ఆధ్వర్యంలో పింక్ టాయిలెట్ల నిర్మాణం చేయబోతున్నామన్నారు. టీసీ వరుణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్షాబంధన్ వేడుకలలో పాల్గొనేందుకు మహిళలు అధిక సంఖ్య లో రావడంతో జనసేన పార్టీ కార్యాలయంలో పండుగ వాతావరణం కనిపించింది. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిలు జయమ్మ, అవుకు విజయకుమార్, నగర కార్యదర్శి లాల్ స్వామి, వీర మహిళ శైలజ కుమారి, నాయకులు రామాంజనేయులు పవనిజం రాజు పాల్గొన్నారు.

## 24 గంటల వ్యవధిలో హత్య కేసును ఛేదించిన పోలీసులు

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 9 ప్రభాతవార్త**



నిందితుని అరెస్ట్ చేసిన పోలీసులు

అనంతపురం నగరంలో శ్రీనివాస్ నగర్ లోని అన్నా క్యాంటీన్ వద్ద శుక్రవారం ఇద్దరు మధ్య జరిగిన ఘర్షణలో వెంకటరాముడు ( 50) అక్కడికక్కడే మృతి మృతి చెందాడు. మృతుడు వెంకట రాముడు సత్య సాయి జిల్లా మంగళ మడక గ్రామం నుంచి బ్రతుకుతెరువు కోసం అనంతపురం నగరంలోని శ్రీనివాస్ నగర్ రాములు గుడి వద్ద నివాసం ఉంటున్నారు . శుక్రవారం రాత్రి బయటకు వచ్చిన వెంకటరాముడు అన్నా క్యాంటీన్ వద్ద నిలబడి ఉండగా మరో వ్యక్తి రామాంజనేయులు దాడి చేశాడు. ఆ దాడిలో వెంకట్ రాముడు అక్కడికక్కడే చనిపోయాడు దాడికి పాల్పడిన రామాంజనేయులు అనంతపురం ఓటవ రోడ్డు ప్రాంతంలోని వినాయక నగర్ లో నివాసం ఉంటున్నాడు. అతడు చిన్న వెంకటరాముడు( 50) పైన దాడి జరిగిన అనంతరం ఇదే ప్రాంతంలో నివాసం ఉంటున్న లక్ష్మీదేవి తన పిల్లలతో కలిసి సంఘటన స్థలానికి పోగానే దాడికి పాల్పడిన రామాంజనేయులును ఎందుకు నా భర్తను కొట్టావు అని అడగగానే అక్కడి నుండి పారిపోయాడని మూడవ పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందిన వెంటనే సీఐ శాంతి లాల్ తన సిబ్బందితో కలిసి గాలింపు చర్యలు చేపట్టి శనివారం దాడి చేసిన రామాంజనేయులు అరెస్ట్ చేసినట్లు సీఐ చెప్పారు.

## అధిక వడ్డీల విషయంలో ఎంతటి వారైనా ఉపేక్షించవద్దు

- వన్ టౌన్ సీఐ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే దగ్గుపాటి సూచన

**అనంతపురం కలెక్టరేట్ ఆగస్టు 9 ప్రభాతవార్త**

వన్ టౌన్ పరిధిలో అధిక వడ్డీలపై ఎక్కువగా ఫిర్యాదులు వస్తున్నాయని.. వీటి విషయంలో కఠిన చర్యలు తీసుకోవాలని నూతన సీఐ వెంకటేశ్వర్లుకు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు. ఈ సందర్భంగా వన్ టౌన్ పరిధిలో ఇటీవల జరుగుతున్న పలు అంశాల గురించి చర్చించారు. శాంతి భద్రతల విషయంలో ఎక్కడా రాజీ వద్దని ఎమ్మెల్యే సీఐకి సూచించారు. వన్ టౌన్ లో విధులు కాస్త కష్టతరంగా ఉంటాయని రాజకీయపరంగా ఎలాంటి ఒత్తిళ్లు మీకు ఉండవన్నారు. ముఖ్యంగా ఇటీవల అధిక వడ్డీల పేరుతో మధ్యతరగతి వర్గాల వారిని వేధిస్తున్నారని.. వీటి విషయంలో కఠినంగా వ్యహరించాలని ఎమ్మెల్యే సూచించారు. బాధితులు ఫిర్యాదు చేసిన వెంటనే వారిపై చర్యలు ఉండాలన్నారు. ఇందులో ఎంతటి వారు ఉన్నా ఉపేక్షించవద్దన్నారు. తమ వైపు నుంచి పోలీసులకు పూర్తి సహకారం ఉంటుందని.. స్వేచ్ఛగా పని చేయాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచించారు.

## పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఎన్. శ్రీనివాసులు ఎన్నిక



నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులను సన్మానించిన ఉద్యోగులు

**అనంతపురం రూరల్, అగస్ట్ 09 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టి రియల్ కూడేరు యూనిట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులుగా ఎన్. శ్రీనివాసులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం, అనంతపురం జిల్లా కూడేరు తాలూకా యూనిట్ ఎన్నికలు శనివారం అనంతపురము మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని మీటింగ్ హాల్ లో ఏర్పాటు చేసుకొని కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగిందని అధ్యక్షులు శ్రీనివాసులు తెలిపారు.కూడేరు తాలుక యూనిట్ కార్యవర్గం ఎన్నికలు ఎన్నికల అధికారి నరసింహారెడ్డి సమక్షంలో నిర్వహించడం జరిగిందని, ఈ ఎన్నికలలో ఎన్నుకోబడిన సంఘ అధ్యక్షులుగా నల్లాని శ్రీనివాసులు,పరిపాలనఅధికారి,యం.పి.పి.అనంతపురం రూరల్,ఉప అధ్యక్షులుగా కె.పి. అనిల్ కుమార్,జూనియర్,సహాయకులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గాండ్లపర్తి. ప్రధాన కార్యదర్శిగా టి. ప్రభాకర్, జూనియర్ సహాయకులు, యం.పి.పి. ఆత్మకూరు .సంయుక్త కార్యదర్శి జి.రియాజ్ అహమ్మద్, రికార్డు సహాయకులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, యం. బండమీద పల్లి. ట్రెజరర్ గా కె.బి.నరేష్, టైపిస్ట్, యం.పి.పి. రాప్తాడు. జిల్లా కౌన్సిలర్ 1 జి. శాంతి స్వరూప్ కుమార్, టైపిస్ట్, యం.పి.పి. కూడేరు. జిల్లా కౌన్సిలర్ 2కుమారీ ఎ. టెయులసుమభారతి,జునియర్,సహాయకులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆత్మకూరు. ఈ ఎన్నికలలో పైన తెలిపిన కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవముగా ఎన్నోకోవడం జరిగిందన్నారు.

## ఘనంగా ప్రపంచ ఆదివాసి దినోత్సవం వేడుకలు



సాకే వీరాంజనేయులు సన్మానిస్తున్న దృశ్యం

**అనంతపురం రూరల్, అగస్ట్ 09 ప్రభాతవార్త**

ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆదివాసి తెగల జాతుల ప్రజలందరికీ ప్రపంచ ఆదివాసి దినోత్సవం శుభాకాంక్షలు తెలియజేయడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎరుకల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాకే వీరాంజనేయులు తెలిపారు. శనివారం పాతఊరు గిరిజన భవనంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమానికి నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించి మెమెంటో ఇచ్చి శాలువా కప్పి ఘనంగా సన్మానించిన గిరిజన సంక్షేమ అధికారులు గిరిజన సంఘ నాయకులు. ఈ సందర్భంగా సాకే వీరాంజనేయులు మాట్లాడుతూ అనంతపురం జిల్లాలో గిరిజనులు ఎదుర్కొంటున్నటువంటి పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది అధికారులు స్పందించి ప్రభుత్వాలు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే విధంగా కృషి చేస్తామని తెలియజేయడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, డిఆర్ఓ, ఎమ్మార్వో, ఆర్ఓ,గిరిజనసంఘ నాయకులు, ఎరుకల కులస్తులు, లంబాడి కులస్తులు, మహిళలు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## రాచానపల్లి పిఏసి అధ్యక్షుని సన్మానించిన టిడిపి నాయకులు

**అనంతపురం రూరల్, అగస్ట్ 09 ప్రభాతవార్త**



పాముదాయి రఘు సన్మానిస్తున్న దృశ్యం

అనంత రూరల్ మండలం రాచానపల్లి సింగల్ విండో అధ్యక్షునిగా పాముదాయి గ్రామానికి చెందిన పాముదాయి రఘు ను రాప్తాడు ఎమ్మెల్యే పరిటాలసునీత నియమించడంతో పీఏసి అధ్యక్షులుగా ఎంపిక అయినా పాముదాయి రఘును రాచానపల్లి టీడీపీ నాయకులు శనివారం అయన నివాసంలో మర్యాదపూర్వకముగా కలసి అయనకు శుభాకాంక్షలు తెలియజేసి శాలువతో సత్కారించి వెంకటేశ్వరస్వామి చిత్ర పట్టాని అందజేశారు. రఘు ను కలసిన వారి లో బీసీసెల్,రాప్తాడునియోజకవర్గ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, దూదేకుల సాధికార సమితి అధ్యక్షులు అలిపిరా, మాజీ ఎంపీటీసీ సర్దానప్ప, టీడీపీ నాయకులురామాంజినేయులు, ఓబిలేసు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన ఆదివాసుల హక్కులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలి.

- ఎస్టీ సెల్ నాయకుడు రమావత్ పరమేష్ నాయక్.

**అనంతపురం రూరల్, అగస్ట్ 09 ప్రభాతవార్త**



దేశంలోని గిరిజన ఆదివాసుల హక్కులను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కాపాడాలని ఎస్టీ సెల్ నాయకుడు రమావత్ పరమేష్ నాయక్ పేర్కొన్నారు. శనివారం ప్రపంచ ఆదివాసుల దినోత్సవం వేడుకల సందర్భంగా జిల్లాలోని గిరిజన ఆదివాసులకు ప్రపంచ ఆదివాసుల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలోని గిరిజన ఆదివాసుల హక్కులు నానాటికి దిగజారి పోతున్నాయని కావున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ఆదివాసుల హక్కులను కాపాడి అన్నిరంగాల్లో వారి ఎదుగుదలకు పాటుపడాలని ఆయన కోరారు.

## కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- బిజెపి మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి

**శింగనమల, ఆగస్టు 9 ప్రభాతవార్త**



కరపత్రాలను పంపిణీ చేస్తున్న బిజెపి నేతలు

గత 11 సంవత్సరాలుగా దేశంలో బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథ కాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని బిజెపి మండల అధ్యక్షులు ఓబిరెడ్డి పేర్కొన్నారు. శనివారం మండల పరిధిలోని పోతురాజు కాలువ గ్రామంలో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2014 నరేంద్రమోదీ ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టాక దేశంలో పేదల కోసం నేటి సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగింద న్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ఓబుళేసు యాదవ్, మానవతి వెంకటయ్య, మల్లెల శ్రీనివాసులు, గుజ్జల యువరాజు పాల్గొన్నారు.

# బుక్కపట్నం అధ్యక్షులుగా సింగం శెట్టి చెన్న కృష్ణ ప్రమాణ స్వీకారం



ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు



ఎమ్మెల్యే, మాజీ మంత్రులను సన్మానిస్తున్న దృశ్యం

బుక్కపట్నం, ఆగస్టు 09, ప్రభాతవార్త

బుక్కపట్నం సింగల్ వంటి అధ్యక్షులుగా సింగం శెట్టి చెన్నకృష్ణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి వల్ల రఘునాథ్ రెడ్డిలు హాజరయ్యారు. వారికి మండల నాయకులు కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు మాట్లాడుతూ, రాక్షస పాలన నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విముక్తి చెందడం వలన ప్రజా రంజిత పథకాలతో ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. నియోజకవర్గంలో 193 చెరువులకు నీళ్లు అందించిన ఘనత టిడిపి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. వృద్ధాప్య వితంతు వికలాంగ పింఛన్లు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, రైతు భరోసా, తల్లికి వందనం లాంటి పథకాలు విజయవంతంగా నెరవేరుస్తున్నామన్నారు. ఆగస్టు 15 నుండి మహిళలకు స్త్రీ శక్తి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం సింగల్ విండో అధ్యక్షులుగా సింగంశెట్టి చెన్న కృష్ణ, డైరెక్టర్లు బుచ్చయ్య గారి పల్లి జయరాం , జంగంపల్లి గంగాద్రిలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మలి రెడ్డి, జనసేన నాయకులు పత్తి చంద్రశేఖర్, మండల కార్యదర్శి గంగాధర్, వలిపి శ్రీనివాసులు, దేవి శెట్టి సంజీవ రాయుడు, తెదేపా జనసేన పార్టీల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వస్తానీ వెనుక.. సినిమా షూటింగ్ ప్రారంభించిన ఎమ్మెల్యే కందికుంట



కెమెరా స్విచ్ఛాన్‌చేసి షూటింగ్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి, ఆగస్టు 9 ప్రభాతవార్త

పట్టణానికి చెందిన ప్రసాద్‌రెడ్డి కుమారుడు నిఖిత్ హీరోగా నటిస్తున్న వస్తా నీ వెనుక మూవీ షూటింగ్ మొదటి సన్నివేశాన్ని శనివారం స్థానిక ప్రముఖ ప్రసిద్ధి గాంచిన ఖాద్రి లక్ష్మినరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి సన్నివేశాన్ని చిత్రీకరించారు. మొదటి సన్నివేశాన్ని స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ కెమెరా స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఖాద్రి నరసింహస్వామి ఆశీస్సులతో సినిమా విజయవంతం కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ వెండిదండు శ్రీనివాసరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# బంజారా సంస్కృతి పరిరక్షకులు సుబ్రమణ్యం నాయక్‌కు సన్మానం

-ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో సేవలను కొనియాడిన వక్తలు



ఎస్.కె.సుబ్రమణ్యం నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం



బంజారా సాంప్రదాయ కత్తి డాల్‌తో ఆర్డీవో కేశవనాయుడు

ఉరవకొండ, ఆగస్టు 9 ప్రభాతవార్త

బంజారా సంస్క ృతిని పరిర క్షిస్తూ క్రమశిక్షణతో కూడిన జీవితం గడుపుతున్న బంజారా రత్న అవార్డు గ్రహిత, సామాజిక వేత్త ఎస్.కె.సుబ్రమ ణ్యంనాయక్ ఘన సన్మానం అందు కున్నారు. జిల్లా కేంద్రం అనంతపు రంలోని గిరిజన భవన్‌లో శనివారం గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జరిగిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో అధికారులు డీఆర్‌వో మలోల, ఆర్డీవో కేశవనాయుడు, గిరిజన సంక్షేమ అధికారి శ్రీనివాసరావు తదితరులు గిరిజ న, ఆదివాసీ సంఘాల నాయకులతో కలిసి ఎస్.కె.సుబ్రమ ణ్యంనాయక్‌ను షాలువాకప్పి సన్మానించి జ్ఞాపికను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణ కలిగిన జీవితంవల్ల సమాజంలో గౌరవ మర్యాదలు లభిస్తాయని నిజాయితీగా నిబద్ధతతో సేవలు అందించినపుడు కలిగే తృప్తి ఎంతో గొప్పదని ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి ఉండి సమాజ సేవ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో బంజారాసంఘం జాతీయనేత ఎస్.కె.కేశవ నాయక్, బీజీఎస్ నేత డాక్టర్ ఎస్.కె.మహేష్‌నాయక్, మాజీ జెడ్పీటీసీ తులసీదాస్‌నాయక్, ఎర్రిస్వామి, గోపాల్‌నాయక్, శీనానాయక్, కమల్‌సింగ్ రాథోడ్, రమేష్‌నాయక్, ఉపనాయక్, ధర్మానాయక్ పాల్గొన్నారు.

# హత్య కేసు నిందితులు అరెస్ట్

-అక్రమ సంబంధమే హత్యకు కారణం -లేపాక్షి ఎస్ఐ నరేంద్ర



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ నరేంద్ర

లేపాక్షి, ఆగస్టు 9 ప్రభాతవార్త

మండలంలోని తిలక్‌నగర్‌లో ఈ నెల 2వతేదీన దాదాపీర్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. మృతుడు దాదాపీర్ తల్లి షేక్‌రహమత్‌ఉన్నిసా ఫిర్యాదు మేరకు కేసును నమోదు చేసి ఎస్ఐ నరేంద్ర దర్యాప్తు చేపట్టాడు. హత్యకు అక్రమ సంబంధమే కారణమని తెలుసుకున్న ఎస్ఐ ఆ కోణంలో విచారణ చేపట్టారు. దాదాపీర్ రెండవ భార్యతో పవన్‌కుమార్ అనే యువకుడు అక్రమ సంబంధం ఏర్పరచుకున్నాడు. ఆ విషయం దాదాపీర్‌కు తెలిసి అతని భార్య దిల్షాద్‌ను, పవన్‌కుమార్‌ను హెచ్చరించి పద్ధతి మార్చుకోక పోతే మీ కథ చెప్తానని హెచ్చరించడం జరిగింది. దీంతో దిల్షాద్, పవన్‌కుమార్ ఇద్దరు దాదాపీర్ అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకొని అనంతరం దాదాపీర్ మట్టు పెట్టేందుకు ఓ పతకం ఆలోచించారు. ఈ నెల 2వతేదీన మందు పార్టీ వుందని పవన్‌కుమార్, ఈనాయత్, నరసింహులు, బాబా అఫ్రీదిలు దాదాపీర్‌ను తిలక్‌నగర్‌కు పిలుచుకు వచ్చారు. నిర్మానుష్య ప్రదేశంలో దాదాపీర్‌ను కట్టెతో కొట్టి, రాళ్లతో కొట్టి వారు పరారయ్యారు. ఎస్ఐ కేసును పరిశీలించి పై నలుగురితో పాటు మృతుని భార్య దిల్షాద్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా తామే హత్య చేసినట్లు బయటపడింద న్నారు. ఐదుగురినిఅరెస్టుచేసి హత్య కు ఉపయోగించిన రెండు ద్విచక్ర వాహనాలు, ఒకకత్తి,రాయిని స్వాధీ నంచేసుకొని రిమాండ్‌కు తరలించి నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

# మృతి చెందిన విద్యార్థి మృతదేహానికి రీ పోస్టుమార్టం

గుత్తి, ఆగస్టు 9 ప్రభాతవార్త

గుత్తి పట్టణంలో ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు బావిలోపడి మరణించిన విద్యార్థిమృతదేహానికి పోలీసు లు శనివారం మరో దఫా పోస్టుమార్టం నిర్వహించారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుత్తి కోటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న రాఘవ వీరాచారి అనే విద్యార్థి గత ఫిబ్రవరిలో ఎల్లమ్మ గుడి ఎదురుగా వున్న బావిలో మృతిచెందాడు. ప్రస్తుతం అతడి సోదరి త్రివేణి ఇచ్చిన ఫిర్యాదుమేరకు పోలీసులుకేసునుతిరిగి ప్రారం భించారు. ఆమె తనతమ్ముడు ప్రమాదవశాత్తు మరణించ లేదని, అతడిని హత్య చేశారని జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేసింది. దీంతో శనివారం జిల్లా ఫోరెన్సిక్ నిపుణులు ఆ మృతదేహానికి పరీక్షలు నిర్వహించారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

# ఆదివాసీ సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలి

ఆదివాసీల జీవన విధానం సమాజానికి ఆదర్శం

జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీవో సువర్ణ, ఎస్సీ ఎస్టీ సెల్ జిల్లా మానటరింగ్ కమిటీ మెంబర్ దేవరకొండ ఉమాశంకర్.



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్,విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఆదివాసి నాయకుడు ఉమాశంకర్.

గోరంట్ల, ఆగస్టు 09: ప్రభాతవార్త

ఆదివాసీల జీవన విధానం సమాజానికి ఆదర్శం కావాలని.. వారి సంప్రదాయాలను రాబోయే తరాలకు అందించాలంటూ..జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అన్నారు.శనివారం గోరంట్ల ప్రభుత్వ గిరిజన గురుకుల బాలికల పాఠశాలలోప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ఆదివాసీలు ప్రకృతితో ఏకీభవించి జీవన సౌహార్దంతో ఉంటారని, వారి జీవన విధానం సమాజానికి ఆదర్శమని అన్నారు. వారసత్వ భాష, నృత్యం, సంప్రదాయాలు, వ్యవసాయ పద్ధతులు వంటి వాటిని రాబోయే తరాలకు అందించాల్సిన బాధ్యత మన అందరి పై ఉందని పిలుపునిచ్చారు.స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన తొలి వీరులు గిరిజనులేనని గుర్తుచేశారు. ఆధునిక సమాజంలో కూడా గిరిజనుల అభివృద్ధి మిగతా వర్గాలతో సమానంగా జరగాలని, ఈ దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు.జిల్లాలోని గిరిజన హాస్టళ్లకు సెంట్రల్ ఫండ్స్, స్టేట్ ఫండ్స్, సిఎస్ఆర్ నిధుల ద్వారా సౌకర్యాల అభివృద్ధి, మరమ్మతులు జరుగుతున్నాయన్నారు. . రహదారి నిర్మాణం, భూసేకరణ, హాస్టల్ మరమ్మతులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యార్థులు బాగా చదివి డాక్టర్లు, ఇంజనీర్లు, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్య, ఆహారం, దుస్తుల వంటి సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో గిరిజన ఏపీ స్టేట్ ట్రైబల్ అడ్వైజరి సభ్యులు సోంల నాయక్, ఏపీ అర్బన్ ఇన్ఫ్రా డెవలప్మెంట్ డైరెక్టర్ కాలే నాయక్, డీస్ట్రిక్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ మెంబర్ ఎస్. శ్రీనివాసులు నాయక్, డివిజనల్ విజిలెన్స్ మనిటోరీ కమిటీ మెంబర్ ఉమ శంకర్, ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ మెంబర్ హరిలాల్ నాయక్ పాల్గొని ప్రసంగించారు. తొలుత మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, గిరిజన స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం చిన్నారులు చేసిన గిరిజన నృత్యాలు అందరిని అలరించాయి. ఈ కార్యక్రమంలో పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, జిల్లా సంక్షేమ అధికారి మోహన్ రామ్, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్తినిలు తదితరులు పాల్గొన్నారు.

# హైకమాండ్ దృష్టికి అనుబంధ కమిటీ ఆశావహుల పేర్లు



మాట్లాడుతున్న దృశ్యం



పాల్గొన్న నాయకులు కార్యకర్తలు దృశ్యం

అమరాపురం ఆగస్టు 9 ప్రభాతవార్త

మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయ ఆవర ణంలో టిడిపి అనుబంధ కమిటీలు నియమకం టిడిపి మండల కన్వీనర్ కృష్ణ మూర్తి అధ్యక్షత న టిడిపి నాయ కులు కార్యకర్తల ప్రత్యేక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సహకార సంఘం అధ్యక్షుడు గణేష్, మాజీ జెడ్పిటిసి నరసిం హామూర్తి, ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జయకుమార్, మండల ప్రధానకార్యదర్శి నాగరాజు, అమరాపురం జడ్పిటిసి పిఆర్ నరసింహమూర్తి, మాజీ మండల కన్వీనర్ శివరుద్రప్ప, మండల టిడిపి క్లస్టర్ కన్వీనర్ నవీన్ కుమార్ టిడిపి యువ నాయకుడు నాగోనపల్లి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే ఎమ్మెస్‌రాజు, మాజీఎమ్మెల్సీ నియో జకవర్గ ఇన్చార్జి గుండుమల తిప్పేస్వామిల ఆదేశాల మేరకు పార్టీ అనుబంధ కమిటీల నియామకంకోసం టిడిపి సీనియర్‌నాయకులు ప్రతి గ్రామపంచాయ తీ నుంచి వచ్చిన టిడిపి శ్రేణులతో చర్చించి ఆశావహుల పేర్లు తీసుకోవడం జరిగింది. ఎమ్మెల్యే తో పాటు మాజీ ఎమ్మెల్సీ తో పాటు మండల సీనియర్ నాయకులు తో చర్చించి అనుబంధ కమిటీ ఎంపిక జాబితాను ప్రకటిస్తామని టిడిపి మండలకన్వీనర్ దేవగానపల్లి కృష్ణమూర్తితెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కుమారస్వామి, మండల క్లస్టర్ కన్వీనర్ కృష్ణమూర్తి, మండల క్లస్టర్ కో కన్వీనర్లు మంజు తారక్ ,చన్నప్ప, సర్పంచి లోకేష్, మార్కెట్‌డైరెక్టర్లు విరుపాక్ష,చంద్రశేఖర్ గుప్తా, హాలుకూరు శ్రీనివాస్, తెలుగు యువత కార్యదర్శి నాగరాజు, గొల్లమారనపల్లి రామచంద్రప్ప, కరిదాసనహట్టి కాంతరాజు, మాజీ ఎంపీపీ రామిరెడ్డి, యూనిట్ ఇంచార్జ్ ప్రభాకర్ ,ఎంపిటిసి ఓంకార్ స్వామి, చన్నబసప్ప, వివేక్, ఆనంద్, డీలర్ రమేష్,పేలుబండ రామన్న, గోవిందప్ప, ఫీల్డ్ అసిస్టెంట్ గిరీష్, గౌడరంగప్ప, మద్దనకుంటరఘు,వీరలింగప్ప, ఎంజారప్ప, దయానంద్, నిరంజన్, తమ్ముడేపల్లి హనుమంతరాయ,పుల్లికుంట నాగరాజు, రాజు, మాజీ ఎంపిటిసి చంద్రప్ప, దయానంద్, పంచాయతీ టిడిపి కన్వీనర్ నాగరాజ్, మంజు, రఘు, పరమేశ్వరప్ప, మాజీ సర్పంచులు పాండు, చంద్రప్ప,శకునప్ప,ఈరన్న తదితరులు పాల్గొన్నారు.

# ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



లేపాక్షి, ఆగస్టు 9 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని పాత లేపాక్షి శ్రీఆంజనేయ స్వామికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మూడవ శనివారాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు స్వామివారికి ఉదయం అభిషేకాలు, అర్చనలు, తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అందంగా అలంకరించారు. భక్తజన సందోహం నడుమ స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

# తెదేపా కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



తెదేపా కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిలు దృశ్యం

బుక్కపట్నం, ఆగస్టు 09, ప్రభాతవార్త

బుక్కపట్నం మండల కేంద్రంలో శనివారం పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డిల చేతులమీదుగా తెలుగుదేశం పార్టీ మండల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వారికి ఎల్లప్పుడూ సముచిత స్థానం లభిస్తుందన్నారు. నాయకులు ప్రజల సమస్యలు పరిష్కరించినప్పుడే వారికి పార్టీకి తగిన ఆదరణ లభిస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీలోనే ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ బడుగు బలహీన వర్గాలకు ఎక్కువ ప్రాధాన్యత కల్పించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్బిరెడ్డి , సాలక్క గారి శ్రీనివాసులు, యర్ర కేశి, జంగం వెంకట్రాముడు, వాజిద్ , క్యాంటీన్ రవి, జనసేన నాయకులు దాసరి శ్రీనివాసులు, బుచ్చయ్య గారి పల్లి చంద్ర , మగ్గం సూరి, సంకు నాగభూషణ, చింతకాయల కేశప్ప, శ్రీరాములు, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# మంచి చారిత్రాత్మక గ్రంథాలను ప్రజలకు అందించండి

అప్పన్న గారి వెంగన్న రచించిన కొత్తచెరువు సమగ్ర చరిత్ర పరిశోధనాత్మక గ్రంథం ఆవిష్కరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి వెల్లడి



పుస్తకావిష్కరణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంగన్న ,ఎమ్మెల్యే , మాజీ మంత్రి పల్లె, విశ్రాంతి ఉద్యోగులు దృశ్యం

కొత్త చెరువు: ఆగస్టు 09 ప్రభాతవార్త.

ప్రజలకు ఉపయోగపడే విధంగా మంచి విజ్ఞానాన్ని వినోదాన్ని అందించే చారిత్రాత్మక గల గ్రంథాలను రచించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ,మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి రచయితలను కోరారు. కొత్తచెరువు మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో కొత్తచెరువు చెందిన రచయిత రిటైర్డ్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులు అప్పన్న గారి వెంగన్న రచించిన కొత్తచెరువు సమగ్ర చరిత్ర పరిశోధనాత్మక గ్రంథాన్ని శనివారం మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి,స్థానిక ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి , విశ్రాంతి ఉద్యోగులు చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూ ర రెడ్డి మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడిగా విద్యారంగానికి అత్యంత కృషి చేసిన విశ్రాంతీ ప్రధానోపాధ్యాయులు అప్పన్న గారి వెంగన్న ఎంతో అనుభవంతో కొత్తచెరువు సమగ్ర చరిత్ర గ్రంథాన్ని ప్రజలకు ఉపయోగపడేలా రచించారని కొనియాడారు. గ్రామంలో ఉన్న మన పూర్వీకుల యొక్క వంశ వృక్షాలను, పురాతన ఆలయాలు మసీదులు , బుక్కపట్నం చెరువు ప్రాముఖ్యత తదితరంశాలను సమగ్రంగా వాటి యొక్క విశిష్టత ను ప్రతి ఒక్కరికి ఉపయోగపడేలా మంచి విజ్ఞానం, వినోదం కలిగించే రూపొందించారు అన్నారు మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ భావితరాలకు ఉపయోగ పడే విధంగా కొత్తచెరువు సమగ్ర పరిశోధనాత్మకమైన గ్రంథం అని కొనియాడారు. ఇలాంటి గ్రంథాల వల్ల కొత్తచెరువుకు పూర్వ వైభవం రావాలన్నారు. కొత్తచెరువు అంటే ప్రతి ఒక్కరికి గుర్తుండాల్సి న అంశం ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ను పదవీచితుడిని చేసినప్పుడు మహా ఉద్యమం ఈ ప్రాంతం నుంచి ప్రారంభమైందని గుర్తు చేశారు. ఈ ఉద్యమ పేరుతో ఇందిరా గాంధీ లాంటి రాజకీయ మేధావు లు కూడా ఈ గడ్డ పోరాటానికి తలవంచి మళ్లీ ఎన్టీ రామారావు ను ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టే విధంగా ప్రజలు మద్దతు పలికారని పేర్కొన్నారు. విద్యావ్యవస్థలవంటి వాటిపై విశ్లేషణాత్మ క చరిత్రను అందించిన అప్పన్న గారి వెంగన్నకు ప్రత్యేక అభినందనలు అలాగే ఈప్రభుత్వ విద్యాసంస్థలకు స్థల దాత రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు రామప్ప గారి కుటుంబ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం కొత్తచెరువు సమగ్ర చరిత్ర పరిశోధనాత్మక గ్రంథాలను మాజీ మంత్రి,ఎమ్మెల్యే పల్లె సింధూర చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈసందర్భంగా రచయి త అప్పన్న గారి వెంగన్న ను మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి ,ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి శాలువ తో సన్మానించి సత్కరించారు పుస్త కా రచయిత వెంగ న్న మాట్లాడుతూ కొత్తచెరువు సమగ్ర చరిత్ర గలిగిన పరిశోధనాత్మక గ్రంథం రచించడంలో నాకు సహకరించి న గ్రామ ప్రజలకు సహచర ఉపాధ్యాయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు ఈపుస్తకం భవిష్యత్ తరాల కు ఎంతోఉపయోగకరంగాఉంటుందన్నారు. ఈ కార్యక్ర మంలో హెచ్ఎం గోపాల్, విశ్రాంతి ప్రధానోపాధ్యా యులు శివయ్య రామకృష్ణయ్య నాగేంద్ర ప్రసాద్, బెంగళూరు సుబ్బయ్య పీవీ రాజీవ్, టిడిపి జిల్లా కార్యవర్గ సభ్యులు సాలక్క గారి శ్రీనివాసులు శ్రీ సాయి తేజ జూనియర్ కాలేజ్ కరస్పాండెంట్ హేమావతి ప్రిన్సిపల్ వెంకటేష్ పట్టణ కన్వీనర్ శ్రీనివాసులు మాజీ సర్పంచ్ శివప్రసాద్ సూర్యనారాయణ ,ప్రకాష్ ,లక్ష్మీనారాయణ రెడ్డి, శ్రీనివాస్ చౌదరి పాల్గొన్నారు.

# ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం చేయూతనివ్వండి

- ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించినందుకు ధన్యవాదాలు
- ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకట్రామయ్య



డిఆర్ఓ మలోలాను సన్మానించి, వినతిపత్రం అందిస్తున్న ఈటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామయ్య,తదితరులు

అనంతపురం ఆగస్టు 9, ప్రభాతవార్త

ఆదివాసీ గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేయూతనిచ్చి అభివృద్ధికి సహకరించాలని ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ సంఘం ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు వెంకట్రామయ్య విజ ్ఞప్తి చేశాడు.ప్రపంచ ఆదీవాసీ దినోత్స వ వేడుకను ప్రభుత్వం తరపున ఘనంగా శనివారం అధికారులు నిర్వహించడం పట్ల ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘం తరపున డిఆర్ఓ మలోలాకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఏకలవ్య గిరిజనులకు అభివృద్ధి పట్ల అధికారులు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను జాప్యం లేకుండా సత్వరం అమలు చేయాలని కోరారు. అదే విధంగా జిల్లా కేంద్రంలో ఏకలవ్య విగ్రహం ఏర్పాటు చేయాలని ఫ్లైఓవర్‌కు ఏకలవ్య ఫ్లైఓవర్‌గా నామకరణం చేయాలన్నారు. రోస్టర్ ప్రకారం స్థానిక స ంస్థల ఎన్నికలలో ఎస్.టి.లు ఎక్కడ ఎక్కువగా నివాసం ఉంటే అక్కడ రిజర్వేషన్ కల్పించాలని, గిరిజన ఉద్యోగులకు పదోన్నతులు రోస్టర్ ప్రకారం చేపట్టాలన్నారు. అదే విధంగా గిరిజన కుటుంబాలకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అమలు చేయాలని, ఎరుకల కార్పొరేషన్‌కు ప్రత్యక నిధులు కేటాయించాలని కోరారు. 50 ఏళ్ల నిండిన గిరిజనులకు పెన్షన్ మంజూరు చేయాలని, ఎస్.టి. బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. అదే విధంగా గిరిజన విద్యార్థులు విదేశాలలో విద్యను అ భ్యసించడానికి ఆర్థిక సాయం అందించాలన్నారు. భూమిలేని నిరుపేద గిరిజనులకు అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు భూమిని కేటాయించాలని అలాగే గిరిజన కార్పొరేషన్‌కు వచ్చే సబ్సిడీ రుణం ఏ ఇతర పథకాలకు కేటాయించకుండా గిరిజనులకే అందించాలన్న ప్రధాన డిమాండ్‌లతో కూడిన వినతిపత్రం డిఆర్ఓ మలోలా,ఆర్డీఓ కేశవనాయుడులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఏకలవ్య ట్రైబల్ ఫెడరేషన్ సంఘం జిల్లా నాయకులు గుజ్జల బ్రహ్మయ్య, డి.చంద్రప్ప, చిన్నలింగన్న, పసలూరి ఈశ్వరయ్య పాల్గొన్నారు.